
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 7 ఫిబ్రవరి 2024





తాడేపల్లి : తాడేపల్లిలో దారా వెంకయ్య కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి



ఓపీ కోసం నిరీక్షణ

కిటకిటలాడిన జీజీహెచ్ ఓపీ విభాగం ● సిబ్బంది లేక రోగుల వెతలు

గుంటూరు(మెడికల్), ఫిబ్రవరి 6: అనారోగ్యంతో చూపించుకునేందుకు వచ్చిన వారికి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చుక్కలు కనిపించాయి. ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఔట్‌పేషెంట్(ఓపీ) విభాగం మంగళవారం ఉదయం రోగుల రద్దీతో కిక్కిరిసింది. ఓపీ చీటి కోసం వందల సంఖ్యలో రోగులు బారులు తీరారు. 11 ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఉండగా మంగళవారం చీటీలు రాసేందుకు కేవలం ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే అందుబాట్లో ఉన్నారు. దీంతో రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఓపీ ఆవరణలో వాహనాల పార్కింగ్ కూడా అస్తవ్యస్తంగా మారింది. వేల సంఖ్యలో రోగులు వస్తున్నా వీరి నియంత్రణకు తగినంత సంఖ్యలో సెక్యూరిటీ సిబ్బందిని నియమించ లేదు. ఓపీ విభాగానికి వచ్చి పరిస్థితులు పరిశీలించిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని తక్కువగా నియమించడంపై వివరణ ఇవ్వాలని పార్కింగ్, సెక్యూరిటీ తదితర మూడు విభాగాల కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశారు.

అండగా ఉంటాం

- మంగళగిరి నియోజకవర్గంలో నిజం గెలవాలి యాత్ర
- టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి భరోసా



దుగ్గిరాల : శృంగారపురంలో టీడీపీ కార్యకర్త శృంగారపాటి శౌరి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్న నారా భువనేశ్వరి

మంగళగిరి, ఫిబ్రవరి 6: అధైర్య పడొద్దు.. పార్టీ మీకు అండగా ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా మంగళవారం ఆమె మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి మండలాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనస్తాపంతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఏడు కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. గన్నవరం విమానాశ్రయంలో ఆమెకు కృష్ణా జిల్లా పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో దుగ్గిరాల గ్రామానికి చేరుకున్నారు. పార్టీ కార్యకర్త కన్నెగంటి మోహనరావు(71) కుటుంబ సభ్యు లను పరామర్శించారు. అనంతరం శృంగారపురం గ్రామంలో శృంగారపాటి శౌరీ(70), మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో అనుమోలు బసవరాజు (55), తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురానికి చెందిన దారా వెంకయ్య (60), మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన వేమూరి కోటయ్య(63), ఎర్రబాలెం గ్రామానికి చెందిన జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు(70), కృష్ణాయ పాలెం గ్రామానికి చెందిన ఈపూరి దేవసహాయం(65) కుటుంబాలను కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భువనేశ్వరిని చూడగానే మృతుల కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. మృతి చెందిన కార్యకర్తలకు నివాళులు అర్పించి, ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున చెక్కులను భువనేశ్వరి అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పార్టీ అండగా నిలుస్తుందని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, నన్నపనేని రాజకుమారి, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



మంగళగిరి: కృష్ణాయపాలెంలో ఈపూరి దేవసహాయం కుటుంబానికి చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

ఆటోతో ఢీకొట్టి.. రాడ్లతో దాడి



దాడిలో గాయ పడిన గొల్లపూడి శ్రీనివాసరావు

- టీడీపీ దళిత నేతపై హత్యాయత్నం
- స్థానికుల కేకలతో వైసీపీ మూకల పరారీ
- తురుమెళ్లలో అధికార పార్టీ శ్రేణుల దారుణం
- ఈ సంఘటనతో పర్యటనను రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

రొంపిచర్ల, నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6: అధికారం అండతో వైసీపీ మూకలు రెచ్చిపోతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల్లో భయాందోళనలే లక్ష్యంగా వైసీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ఇందుకు తాజాగా మంగళవారం ఉదయం పల్నాడులో చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. ద్విచక్ర వాహనంపై పనికి వెళ్తున్న టీడీపీ నాయకుడ్ని ఆటోతో ఢీకొట్టి కిందపడిపోయిన తర్వాత గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా వైసీపీ మూకలు దాడి చేశాయి. దాడిని గమనించిన స్థానికులు కేకలతో వైసీపీ వర్గీయులు పారిపోయారు. లేదంటే బాధితుడు మృతి చెంది ఉండేవాడే. సంచలనం కలిగించిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామానికి చెందిన గొల్లపూడి శ్రీనివాసరావు భవన నిర్మాణ కార్మికుడు. టీడీపీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటాడు. డిసెంబరు 31న గ్రామంలో ఫ్లెక్సీల వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావును హతమార్చేందుకు గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు పథకం రూపొందించారు. ఈ క్రమంలో రోజులానే పనినిమిత్తం శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం నరసరావుపేటకు బయల్దేరారు. కాపుకాసి ఉన్న వారు ఆయన్ను ఆటోలో వెంబడించి గ్రామ శివార్లలో ఢీకొట్టారు. ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిపోయిన శ్రీనివాసరావుపై ఆటోలోని వారు ఇనుప రాడ్లు, గొడ్డళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టారు. కాళ్లను నుజ్జునుజ్జు చేశారు. తలపై గొడ్డలితో కొట్టారు. దాడిని ఆ సమీపంలోని పొలాల్లో ఉన్న వ్యక్తులు గమనించి కేకలు వేయడంతో అగంతకులు అక్కడి నుంచి పారిపోయారు. వారు తెచ్చుకున్న ఆటోను సంఘటనా స్థలంలో వదలివెళ్లారు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న శ్రీనివాసరావును స్థానికులు నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన నియోజకవర్గంలో కలకలంరేపింది. రొంపిచర్ల పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అగంతకులు వదిలివెళ్లిన ఆటోను స్వాధీనపరుచుకున్నారు. ఎస్ఐ పాల్‌రాజ్ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన గొల్లపూడి రామారావు, మరి కొంతమంది హత్యాయత్నం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో ముందుగా ఏర్పాటు



తురుమెళ్ళలో పోలీసుల పహారా

చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన వివాదం నేపథ్యంలో శ్రీనివాసరావు హత్యకు వైసీపీ నేతలు యత్నించారని టీడీపీ నేతలు చెబుతున్నారు.

దారుణం : డాక్టర్ అరవిందబాబు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును టీడీపీ ఇన్‌చార్జి అరవింద బాబు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఎస్సీ కుటుంబానికి చెంది, కూలి పనులతో జీవనం సాగించే శ్రీనివాసరావుపై దాడి దారుణం అన్నారు. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే తురమెళ్ల గ్రామ వైసీపీకి చెందిన గోళ్ళపూడి రామారావు, కొండయ్య, తిరుమల చెంచారావు, తిరుమల కోటేశ్వ రరావు, మరో గుర్తు తెలియని వ్యక్తి దాడిలో పాల్గొన్నారని చెప్పారు. దాడిని సర్పంచ్ గాజుల మాణిక్యరావు, చిన కోటేశ్వ రరావు, కాటం శ్రీనివాసరావు, కాటం నాగాంజనేయులు ప్రోత్సహించా రని చెప్పారు. దాడిపై ఎస్పీ న్యాయవిచారణ జరిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వ్పటి నుంచి ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. తురుమెళ్ల, అలవాల గ్రామాలపై దృష్టి పెట్టాలని ఎస్పీని కోరినా ఆయన పెడ చెవిన పెట్టారని అందు వల్లే ఈ దాడి జరిగిందన్నారు. అరవిందబాబు వెంట మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బా రావు, టీడీపీ రొంపిచర్ల మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గారావు, మడకా శివప్రసాదరావు, పాపారావు, మరియబాబు, న్యాయవాదులు సీతారామయ్య, చక్రపాణి తదితరులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: జీవీ

టీడీపీ దళిత నేత శ్రీనివాసరావుపై వైసీపీ శ్రేణుల హత్యాయత్నం దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సర్పంచ్ ఆధ్వర్యంలోనే వైసీపీ శ్రేణులు హత్యాయత్నానికి పాల్పడ్డా యని ఆరోపించారు. రోజురోజుకు వైసీపీ గుండాలు పెట్రేగిపోయి అల్లర్లు, దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసుల సమక్షంలో వీధి రౌడీల్లా కర్ర లు, రాడ్లు పట్టుకుని వీరంగం సృష్టిస్తూ అల్లర్లు సృష్టిస్తున్న సంఘటనలు ఉన్నాయన్నారు.

బడి పిల్లలకూ.. ఓట్లు




బడికి వెళ్లి పాఠాలు వినాల్సిన వారు.. రానున్న ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న వారి వయస్సు 14 ఏళ్లు కాగా 21 ఏళ్లుగా చూపి వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చారు. బరితెగించిన వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు ఎన్నికల అధికారులు ఆమోదం తెలిపారు. టీడీపీకి పట్టున్న బెల్లంకొండ మండలంలో పాగా వేసేందుకు వైసీపీ నేతలు బడి పిల్లలను పావులుగా మార్చు కున్నారు. పెదకూరపాడు ఓట్ల జాబితాలో ఈ చిత్రవిచిత్రాలు వెలుగు చూశాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాలనీలో అత్యధిక మెజారిటీ రావాలని ఎమ్మెల్యే చెప్పడంతో స్థానిక నేతలు విద్యార్థులను ఓటర్ల జాబితాలోకి చేర్పించేశారు. పెదకూ రపాడు నియోజకవర్గం బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెం(పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామం) ఓటర్ల జాబితా చూసిన వారికి నోట మాట రావడం లేదు.

- 14 ఏళ్లకు 21గా చూపి నమోదు
- వైసీపీ నేతల ఒత్తిడి.. అధికారుల ఆమోదం
- 8వ తరగతి విద్యార్థుల పేర్లు ఓటర్ల జాబితాలో..

బెల్లంకొండ, గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6: పెదకూరపాడు నియోజకవర్గం బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెం పులిచింతల ముంపు కాలనీలో నివాసముంటున్న చాలామంది పిల్లలు సమీపంలోని సత్తెనపల్లి, బెల్లంకొండ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వారి వయస్సు కేవలం 14 ఏళ్లలోపే. అయితే గెలుపే ధ్యేయంగా పెట్టుకున్న వైసీపీ నేతలు బడి పిల్లలను ఓటర్లగా చేర్చేశారు. ఓటర్ల తుది జాబితా విడుదల అయ్యే వరకు 14 ఏళ్ల లోపు వయస్సున్న పిల్లలకు ఓటు హక్కు వచ్చిన సంగతి ఎవరికీ తెలియదు. ఎమ్మాజీగూడెం పోలింగ్ బూత్ నెంబరు 28 ఓటర్ల జాబితాలో చేరిన పిల్లలు ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వాస్తవానికి వారి వయస్సు 14 ఏళ్లు మాత్రమే ఓటర్ల జాబితాలో వారికి 21 సంవత్సరాలు ఉన్నట్లుగా చూపించారు. కొత్తగా ఓట్లు వచ్చినట్లు చెబుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు వైసీపీ సానుభూతిపరులుగా ఉన్నట్లు సమాచారం. 14 ఏళ్ల పిల్లలకు ఓటు హక్కును కల్పించిన తహసీల్దార్ రెండు రోజుల క్రితం బదిలీపై వెళ్లిపోయారు.



ఎమ్మాజీగూడెంలో 14 ఏళ్ల పిల్లల కు ఓటు హక్కు కల్పించిన జాబితా



విద్యార్థులకు ఓట్లు ఇలా..

ఎమ్మాజీగూడెం పులిచింతల ముంపు కాలనీకి చెందిన ఓర్సు చంద్రకళ సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఓటర్ల జాబితా సీరియల్ నెంబరు 1039 లో ఈ బాలికకు ఓటు ఉంది.

◆ ఓర్సు శివగోపి పాపాయిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 1037లో ఈ బాలుడికి ఓటు ఉంది.

◆ కూరాకుల హిమబిందు బెల్లంకొండ అడ్డరోడ్డులోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుకుంటుంది. ఈ బాలికకు ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 1027లో ఓటు హక్కు ఉంది.

సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠ శాలలో 8వ తరగతి చదువుతున్న తమ్మిశెట్టి మహాలక్ష్మికి ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 1028లో ఓటు ఉంది.

◆ ఏడో తరగతి వరకు చదివి ఎమ్మాజీగూడెం పాఠశాలలో డ్రాప్ ఔట్‌గా ఉన్న ఓర్సు లక్ష్మీ తిరుపతమ్మకు ఓటరు జాబితా సీరియల్ నెంబరు 1026లో ఓటు ఇచ్చారు.

◆ పాపాయపాలెం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రావూరి మనోజ్‌కుమార్‌కు ఓటరు జాబి తా సీరియల్ నెంబరు 1031లో ఓటు ఉంది.

◆ పేరేచర్ల ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తురక నీలిమకు ఓటరు జాబితా సీరియల్ నెంబరు 1040లో ఓటు ఉంది.

◆ సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నంద్యాల వాసవికి ఓటు సీరియల్ నెంబరు 1048లో ఉంది.

◆ దాచేపల్లి మండలం కేసానుపల్లి సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బత్తుల శివ పూజితకు ఓటర్ సీరియల్ నెంబరు 1052లో ఓటు కల్పించారు.

◆ సత్తెనపల్లి శాంతినికేతన్‌లో ఇంటర్ మొదటి సం వత్సరం చదువుతున్న జల్లి దివ్యకు ఓటరు జాబి తా సీరియల్ నెంబరు 1053లో ఓటు ఉంది.

ప్రజాస్వామ్యం ఖూనీ

ఎమ్మెల్యే శంకరరావు పిల్లలకు ఓటు హక్కు కలిపించి ప్రజాస్వామ్యం ఖూనీ చేశారు. తప్పుడు మార్గంలో గెలవాలన్న ఆలోచనతోనే విద్యార్థులకు ఓటు హక్కు కల్పించారు. అధికారులు వైసీపీ నేతలకు తొత్తులుగా మారిపోయి ఈ దారుణానికి ఒడిగట్టారు. బడి పిల్లలకు ఓటు హక్కు కల్పించిన అధికారులపై, ఒత్తిడి చేసిన వైసీపీ ఎమ్మెల్యే శంకరరావుపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

- శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే పెదకూరపాడు

సర్వేకు.. ప్రతిష్ఠంభన



◆ పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు ◆ డీ.నెంబరు దస్తావేజులపై చేతులెత్తేసిన నగరపాలక సంస్థ
◆ మండల సర్వేయర్లతో చేయించుకోవాలని కమిషనర్ సర్క్యులర్ ◆ నగర పరిధితో తమకు సంబంధం లేదని మండల సర్వేయర్ల స్పష్టీకరణ ◆ ప్రతి దానికి సర్వే సర్టిఫికెట్ అడుగుతుండడంతో దరఖాస్తుదారుల అయోమయం

గుంటూరు, ఫిబ్రవరి 6: నగరంలో సర్వేల ప్రతిష్ఠంభన నెలకొంది. స్థిరాస్తుల ధ్రువీకరించే సర్వే సర్టిఫికెట్ ఎంతో ముఖ్యం. గతంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నగర పాలక సంస్థ పది నుంచి 20 రోజుల్లో సర్వే పూర్తి చేసి సర్టిఫికెట్ జారీ చేసేది. కానీ కొద్ది కాలంగా సిబ్బంది కొరతతో నిర్ణీత సమయంలో సర్వే చేయడం లేదు. ఎవరైనా పలుకుబడి ఉన్నవారికో, చేతులు తడిపిన వారికో సర్వే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు ఒక్కొక్కరు చొప్పున సర్వేయర్లు అందుబాటులో ఉండేవారు. కానీ నవంబరు నుంచి ఒక్క సర్వేయర్ అందుబాటులో ఉన్నారు. దీనికి తోడు ఆయనకు జగనన్న ఇల్లు లేఅవుట్లు, గృహ నిర్మాణ పథకాల పనులతో సర్వే వ్యవహారం జఠిలంగా మారింది. డి.నెంబరు పేరుతో ఉన్న దస్తావేజుల దరఖాస్తుల సర్వేను నిలిపివేయాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశించారు. డీ నెంబర్ కలిగిన దస్తావేజులకు సంబంధించిన సర్వేను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండే రెవెన్యూ సర్వేయర్లు చేయాల్సి ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ స్పష్టం చేశారు. ఇందుకుగాను సంబంధిత అధికారులకు సర్క్యులర్ కూడా జారీ చేశారు. అయితే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు సర్వే కోసం నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా సర్వేయర్లు ఇదే విషయాన్ని వారికి స్పష్టం చేస్తున్నారు. దీంతో వారు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు వెళుతుండగా అక్కడ వారికి చేదు అనుభవం ఎదురవుతుంది. తమకు సంబంధం లేదని తాము కేవలం గ్రామ పరిధిలోని పొలాలకు సంబంధించిన సర్వే మాత్రమే చేస్తామని స్పష్టం చేస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు.



అయితే నగలపాలక సంస్థ కమిషనర్ ఇచ్చిన సర్క్యులర్ వివరాలను ఆయా రెవెన్యూ సర్వేయర్ల దృష్టికి తీసుకెళ్తే తమకు దానితో సంబంధం లేదని, నగరంలో సర్వేపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని స్పష్టం చేశారు. ప్రస్తుతం నగర పరిధిలో టీఎస్(టౌన్ సర్వే) కలిగిన దస్తావేజులకు సంబంధించి మాత్రమే సర్వే చేస్తున్నట్లు సర్వే సిబ్బంది చెబుతున్నారు. టీఎస్ కలిగిన దస్తావేజుల దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు అర్జీదారులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో సర్వే కోసం వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. గడిచిన ఏడాది కాలానికి పైగా సరిగా సర్వే జరగకపోవడంతో దరఖాస్తు లు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు దారులు నగరపాలక సంస్థకు వేలాది రూపాయలు చెల్లించారు. రిజిస్ట్రేషన్లు, ఆస్తుల క్రయ విక్రయాలు, బ్యాంకు రుణాలు వంటి వాటికి అవసరమైన సర్వే సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నగరంలో సర్వేల విషయం లో నెలకున్న ప్రతిష్ఠంభన తొలగించాలని అర్జీ దారులు కోరుతున్నారు.

స్మార్ట్ టౌన్‌షిప్‌లు..కలేనా?

- భూసేకరణకు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- లేఅవుట్‌లు ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మధ్యతరగతికి స్థలాల పంపిణీ ముందడుగు పడటంలేదు. పట్టణాల వారీగా అధికారులు ప్రభుత్వానికి భూమిని సేకరించడానికి ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు కొన్ని పట్టణాల్లో గజం స్థలం కూడా సేకరించలేదు. రాజధాని ప్రాంతంలో మినహా మరెక్కడా స్థలాలు లేవు. భూమిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఈ లేఅవుట్లు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీల ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అథారిటీల వారీగా స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపినా నేటివరకు నిధుల విడుదలకు అతీగతి లేదు. దీంతో భూసేకరణ నిలిచిపోయింది.



నవులూరు వద్ద స్మార్ట్ సిటీ నమూనా చిత్రం

మూడేళ్ల కిందటే ఆదేశాలు..

ప్రభుత్వం ఎంఐజీ గ్రూప్ వారికి స్థలాలివ్వాలని 2020 సంవత్సరంలో అధికారులకు ఆదేశాలిచ్చింది. అన్ని నియోజక వర్గ కేంద్రాలు, మునిసిపాల్టీల పరిధిలో స్థలసేకరణ చేపట్టాల్సి ఉండగా ఇంత వరకు ఒక్కచోట కూడా కొలిక్కిరాలేదు. రెవెన్యూ సహకారంతో స్థలాలను సేకరించి లేఅవుట్‌లు ఆమోదం తీసుకొనే బాధ్యతలను అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలకు అప్పగించింది. సంబంధిత అధికారులు స్థలసేకరణ అంశాన్ని రెవెన్యూ దృష్టికి తీసు కెళ్లినప్పటికీ స్పందనలేదు. నిబంధనల ప్రకారం పట్టణానికి అయిదు కిలో మీటర్ల లోపునే భూమిని సేకరించాల్సి ఉంది. అదీ కూడా ఎకరం రూ.కోటి న్నర లోపు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ విధంగా పట్టణాలకు చుట్టుపక్కల భూమి లభ్యం కావడంలేదు. అత్యధిక ధరతో కొనుగోలు చేస్తే ఆ భారం లబ్ధిదారులపై పడుతోంది.

మునిసిపాలిటీల వారీగా డిమాండ్...

అన్ని పట్టణాల పరిధిలో పది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. 150, 200, 240 గజాలుగా ప్లాట్లను విభజిస్తారు. లేఅవుట్‌లో రహదారులు, కాలువలు, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తుంది. రిజర్వ్ స్థలంలో ప్రజావసరాల కోసం బడి, గుడి వంటివి నిర్మిస్తుంది. అనంతరం దరఖాస్తులు స్వీకరిస్తుంది. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎవరైనా ఇందుకు అర్హులే. లేఅవుట్ ఆమోదం అనంతరం దరఖాస్తుదారులను ఎంపిక చేయాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో స్థలాల డిమాండ్‌ను సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ మేరకు మునిసిపాల్టీల వారీగా ప్లాట్ల డిమాండ్‌ను నిర్ధారించారు. దాదాపు 28,416 ప్లాట్లు అవసరం ఉందని గుర్తించారు. నరసరావుపేట మునిసిపాల్టీలో 1864 ప్లాట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సదరు అధికారులు సిద్ధం చేశారు. అలాగే చిలకలూరిపేట 651 ప్లాట్లు, మాచర్ల 108, సత్తెనపల్లి 346, వినుకొండ 608, పిడుగురాళ్ల 482, దాచేపల్లి 56, గురజాల 21, బాపట్ల 3171, గుంటూరు 9614, మంగళగిరి 1344, పొన్నూరు 531, రెపల్లే 1066, తాడేపల్లి 2065, తెనాలి 2962, అద్దంకి 1104, చీరాల 2095 ప్లాట్లు అవసరం ఉందని నిర్ధారించారు. ఈ మేరకు అర్బన్ అథారిటీలు భూమి సేకరణకు ప్రతిపాదనలు రూపొందించాయి. రాజధాని పరిధిలో మంగళగిరి నియోజకవర్గ నవులూరులో గజం రూ.17,499గా నిర్ణయించి దరఖాస్తులను స్వీకరించారు. ఇక్కడ మినహా మరెక్కడా అమలు జరగలేదు. ఈ ప్రక్రియ దాదాపు అటకెక్కినట్లే. పథకం అమలు లక్ష్యం ఘనంగా ఉన్నా ఆచరణ మాత్రం శూన్యమని చెప్పవచ్చు.

సర్పంచ్‌ల అరెస్టు ప్రభుత్వానికి సిగ్గుచేటు

● ఎమ్మెల్యే అనగాని



రేపల్లె, ఫిబ్రవరి 6: పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను దారి మళ్ళించి స్వాహా చెయ్యటం సిగ్గుచేటని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వస్తే కనీసం గౌరవం లేకుండా పోలీసులను అడ్డుపెట్టి వారిపై దాడిచేసి అరెస్టు చెయ్యటాన్ని ఎమ్మెల్యే అనగాని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14,15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ.8,629 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి దారి మళ్ళించిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేక కేంద్రం ఇచ్చే నిధులన్నీ దారి మళ్ళిస్తూ స్వలాభాల కోసం పథకాల పేరిట దోచేస్తున్నారన్నారు. పంచాయతీల్లో కనీసం కరెంటు బిల్లులు, మంచినీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పర్యావరణాన్ని రక్షించేందుకు కనీసం రూపాయి లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఒక్కో పంచాయతీకి విద్యుత్ బిల్లులే లక్షల్లో పేరుకుపోయాయన్నారు. ఓ పక్క జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారే తప్పా పంచాయతీలను అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారన్నారు.

ఎంపీ బాలశౌరిపై విమర్శలు తగదు

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన



గుంటూరు, ఫిబ్రవరి 6: దిగజారుడు రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని, మంత్రి అంబటి రాంబాబులకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒక ఎంపీగా ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తనకు తెలుసుని బాలశౌరి చెప్పగానే, మీరిద్దరూ ఎందుకు భుజాలు తడుముకుంటున్నారుని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో అమరావతి రాజధానిగా ఇక్కడే ఉంటుందని చెప్పిన జగన్, ఎన్నికలు ముగియగానే అమరావతి వద్దు, మూడు రాజధానులే ముద్దు అని రాష్ట్ర ప్రజలను మోసం చేయడం నిజం కాదా అంటూ నిలదీశారు. ఇరిగేషన్ మంత్రిగా ఉండి పోలవరం పూర్తి చేయకుండా, సంక్రాంతికి లాటరీలు పెట్టి డాన్సులు చేసే అంబటి రాంబాబుకు రెండో పంటకు నీళ్ళు లేక మొక్కజొన్న వేసిన గుంటూరు జిల్లా రైతులు ఎంత కష్టాలు పడుతున్నారో తెలుస్తుందా? అంటూ ఆయన విమర్శించారు. రాజకీయాలను సంపాదనా వృత్తిగా మార్చిందే మీరు. రాజకీయం చేసి అడుక్కోవడం, దోచుకోవడం మీ నైజమని ఆయన దుయ్యబట్టారు.



చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గత ఏడాది దుగ్గిరాలలో మృతి చెందిన టీడీపీ శ్రేణుల కుటుంబసభ్యులను మంగళవారం నారా భువనేశ్వరి పరామర్శించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. టీడీపీ కార్యకర్త కన్నెగంటి మోహనరావు కుటుంబం, మంగళగిరి మండలం చినకాకానిలో బసవరాజు కుటుంబం, నవులూరులో కోటయ్య కుటుంబం, యర్రబాలెంలో జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు కుటుంబానికి చెక్కులను అందజేస్తున్న భువనేశ్వరి.

\- మంగళగిరి



ఆరోగ్య శ్రీ కార్డులు.. అబాసుపాలు

పేరు ఒకరిది.. ఫొటో మరొకరిది ● ఆరోగ్య మంత్రి జిల్లా లో అన్నీ తప్పులతడకలే

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6 : ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ ప్రహసనంగా మారింది. కొత్త కార్డు ల్లో నమోదైన వివరాలన్నీ తప్పుల తడకలగా ఉంటున్నాయి.పేరు ఒకరిది అయితే..ఫోటో మరొకరిది..ఊరు ఇంకొకరిది ఉండటం తో కొత్త కార్డు లు చూసి ప్రజలు పెదవి విరుస్తున్నారు. చాలా కార్డుల్లో అసలు ఏ విధమైన వివరాలు లేకుండా ఆరోగ్య సిబ్బందికి చేరాయి. ఊరు, పేరు లేని ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేసి వాటిని ప్రజలకు వెంటనే అందజేయాలని జిల్లా అధికారులు కింద స్థాయి సిబ్బంది పై ఒత్తిడి చేస్తున్నారు.ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లా లోనే వేలకొద్దీ ఆరోగ్య శ్రీ కార్డులు తప్పులతడకగా ఉండటంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డులు మూడేళ్ళ కిందటే పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఫోటో కోసమని అప్పట్లో కార్డులను కొత్త గా ముద్రించి పంపిణీ చేశారు. ఇప్పుడు అదే కార్డుల స్థానంలో కొత్త వాటిని తీసుకువచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ప్రయోజనం కలిగేలా కొత్త కార్డులను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల ముందు రూ.25 లక్షల వరకు వినియోగ పరిమితి పెంచిన కార్డు లను యుద్ధ ప్రాతిపదికన ఇంటింటికి పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.ఈ కార్డుల పంపిణీపై ప్రతి రోజు కలెక్టర్‌లు సమీక్ష నిర్వహిస్తున్నారంటే ప్రభుత్వం ఈ అంశాన్ని ఎన్నికల్లో ఏ స్థాయి లో వినియోగించుకోవాలన్న ఆలోచన తో వుందో అర్థం చేసుకోవచ్చు.

అన్నీ తప్పులే..

తప్పులతో ఉన్న ఆరోగ్య శ్రీ కార్డు ల పంపిణీ కార్యక్రమం ఉద్యోగులకు సంకటగా మారింది.గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామానికి చెందిన మంచాల గంగయ్య పేరుతో ఉన్న ఆరోగ్య శ్రీ కార్డులో ,పెదనందిపాడు మండలం రావిపాడు కు చెందిన వ్యక్తి ఫోటో ముద్రించారు. రావిపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి కోటమ్మ పేరుతో వివరాలు ఉన్న కార్డు లో ఆ గ్రామానికి సంబంధం లేని పురుషుడి ఫోటో ను ముద్రించారు. గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామానికి చెందిన బండారు శివకుమార్ పేరుతో వివరాలు ఉన్న కార్డు పై రావిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి ఫోటో ను ముద్రించారు. ఇలా జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ అయిన ఆరోగ్య శ్రీ కార్డులు తప్పులతో నిండి ఉన్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. వీటిని వీలైనంత త్వరగా పంపిణీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు. వివరాలు సరిగా లేని కార్డు లను తీసుకునేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారని సమాచారం.

యువకుడు దారుణ హత్య

రాడ్ తో కొట్టి చంపిన తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి

గుంటూరు, ఫిబ్రవరి 6 : గుంటూరు నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావు తోట సమీపంలో గల పీకల వాగు కట్టపై మంగళవారం రాత్రి ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. షేక్ మహబూబ్ సుభాని అలియాస్ సోను (25) అనే యువకుడిని ఆమె తల్లితో సహజీవనం చేస్తున్న షేక్ బాజీ అనే వ్యక్తి రాడ్డుతో కొట్టి చంపాడు.పీకలవాగు ప్రాంతానికి చెందిన జరీనా బేగం కు షేక్ సుభాని అలియాస్ సోను అనే కుమారుడు ఉన్నాడు. సుభాని చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు. సుభాని ఆటో మెకానిక్ గా పనిచేస్తుంటాడు. ఇలా ఉంటే లింగాయపాలెం ప్లాట్స్ కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ బాజీ కొన్ని సంవత్సరాలుగా జరీనాబేగంతో సహజీవనం చేస్తున్నాడు. బాజీ ఇంటికి రావడం సుబానీ కి ఇష్టం లేదు. ఈ క్రమంలో మద్యం సేవించినప్పుడల్లా బాజీతో గొడవ పడుతుండేవాడు. అయితే మంగళవారం రాత్రి కూడా బాజీ ఇంటికి వచ్చాడు. ఈ విషయంపై సుభాని, బాజీకి మధ్య గొడవ జరిగింది. దీంతో మద్యం మత్తులో ఉన్న బాజీ ఇనుపరాడ్ తో సుభాని తలపై బలంగా కొట్టి హత మార్చాడు. దీంతో సుభాని సంఘటనా స్థలంలోనే కుప్ప కూలి రక్తపు మడుగులో మృతి చెందాడు. సమాచార అందుకున్న నగరంపాలెం సీఐ నరేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తల్లి జరీనాబేగం ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అయితే ఆమె కూడా మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బాజీ పరారీలో ఉన్నాడని త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

భద్రాచలం, ఫిబ్రవరి 6: ఇద్దరు అంతర రాష్ట్ర దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ షాహీనా తెలిపారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో జనవరి 16 రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో దుకాణం ముందు పార్క్ చేసి ఉన్న బుల్లెట్ బైక్‌ను కారులో వచ్చిన కొందరు వ్యక్తులు దొంగలించడానికి ప్రయత్నిస్తుండగా వారిని గమనించిన పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారు కారు వదిలి పారిపోయారు. మంగళవారం మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామశివారులో ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ఏపీ 39 సీజెడ్ 5565 ద్విచక్రవాహనంపై యర్రగుంట వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలు దొంగతనాలు చేసినట్టు గుర్తించారు. నిందితులు ఆంధ్రరాష్ట్రంలోని పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలం, సాతులూరు గ్రామానికి చెందిన మన్నేపల్లి పవన్‌కుమార్, సయ్యద్ షరీఫ్ అని తెలిపారు. మన్నేపల్లి పవన్‌కుమార్ బీటెక్ విద్యార్థి సయ్యద్ షరీఫ్ పెరంచర్లలోని యూనివర్సల్ కాలేజ్ సెక్యూరిటి గార్డుగా పని చేస్తాడని తెలిపారు. వీరితోపాటు సుభాని, వీరయ్య, అష్రఫ్‌లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు చోట్ల అనేక దొంగతనాలు చేశారని తెలపారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు విచారణలో తెలిసినట్లు పెర్కొన్నారు. వదిలి వెళ్లిన కారు కోసం వీరిద్దరు వచ్చి పోలీస్‌లకు పట్టుబడ్డారు, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. పోలీస్ సిబ్బంది ఫిర్యాదు మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబం ఆత్మహత్య ఘటనలో మరో ఇద్దరు మృతి

చికిత్స పొందుతూ తల్లి, మరో కుమారుడు ● నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



వసంత (ఫైల్‌ఫొటో)

మాచర్ల, ఫిబ్రవరి 6: భర్త, తన ముగ్గురు కుమారులకు ఎలుకల మందు తాపించి తాను కూడా ఎలుకల మందు తాగి ఓ తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి ఇరువురు కుమారులు సోమవారం మృతిచెందగా మంగళవారం మిగిలిన కుమారుడు, భార్య మృతిచెందారు. నారాయణరెడ్డిపురానికి చెందిన రమావత్ రవినాయక్, వసంతలు భార్యభర్తలు. వీరికి పన్నెండేళ్ల రమావత్ భాను ప్రకాష్, యేడేళ్ల కార్తీక్ ప్రకాష్, రెండున్నరేళ్ల కవలలు ఈశ్వర్, ఉమేశ్వర్‌లు సంతానం. రవినాయక్ హైదరాబాద్‌లో ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అప్పులు కారణంగా భార్యాభర్తలు కొద్దిరోజులుగా తరచూ గొడవలు పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వసంత భర్తతోపాటు కుమారులు భానుప్రకాష్, ఈశ్వర్, ఉమేశ్వర్‌లకు టీ లో ఎలుకల మందు కలిపి ఇచ్చింది. చికిత్స పొందుతూ సోమవారం ఈశ్వర్, భాను ప్రకాష్ మరణించారు. కాగా గుంటూరులో చికిత్స పొందుతున్న వసంత మంగళవారం మృతి చెందారు. అలాగే రెండున్నరేళ్ల ఉమేశ్వర్ కూడా హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై విజయపురిసౌత్ ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు.

మాట తప్పారు.. మడమ తిప్పారు

● 1512వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు ఫిబ్రవరి6: ఇక్కడే మా నాయకుడు జగన్‌రెడ్డి ఇళ్లు కట్టుకున్నాడన్న ఎమ్మెల్యేలు మంత్రులు.. అధికారంలోకి రాగానే అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి.. వెరసి మూడు రాజధానులంటూ ఐదు కోట్ల మందిని మోసం చేశారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు మూడు రాజధానులకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1512వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అమరావతిని స్వాగతిస్తున్నామని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి అసెంబ్లీలో ఆనాడు చెప్పాడన్నారు. అధికారంలోకి రాగానే అమరావతిపై విషం చిమ్మారన్నారు. మాటతప్పి మడమ తిప్పాడన్నారు. అబద్ధాలు ఆడుతూ పరిపాలన చేయటం ఆయనకు పరిపాటి అయ్యిందన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది.



సీఎం అసెంబ్లీకి వెళ్ళేటప్పుడు బిల్డ్ అమరావతి అంటూ మందడం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

సాయంత్రం వేళ దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

విజయమే లక్ష్యంగా పని చేయండి : మనోహర్

వేమూరు, ఫిబ్రవరి 6: పార్టీ అభ్యర్థి విజయమే ప్రధాన లక్ష్యంగా జనసేన పార్టీ శ్రేణులు టీడీపీ శ్రేణులతో సమన్వయంగా ముందుకు నడవాలని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని చావలి గ్రామానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు జనసేన, తెలుగుదేశం పార్టీలు కలసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాయని అన్నారు. రెండు పార్టీల అధినేతలు నిర్ణయం ప్రకారం నియోజకవర్గం అభ్యర్థులు నిలబడతారని వారిని గెలిపించడమే ధ్యేయంగా వివిధ విభాగాల్లో ఉన్న పార్టీ అభిమానులను కలుపుకొనిపోవాలని పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలను రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్ పాలనకు బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ శ్రేణులను సమన్వయ పరుచుకుంటూ గ్రామ గ్రామాన ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ వైసీపీ వ్యతిరేక ఓటును చీలకుండా చేయాలని సూచించారు. జనసేన పార్టీ నాయకులు దాసరి శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త ఊస రాజేష్, గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు ఉన్నారు.

బాపట్ల డీఆర్‌వోగా సత్తిబాబు

● గుంటూరు డ్వామా పీడీగా ఉమాదేవి

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా బాపట్ల నూతన డీఆర్‌వోగా సీహెచ్ సత్తిబాబుని ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు కాగా బాపట్ల ప్రస్తుత డీఆర్‌వో పీవీ రమణని బదిలీ చేసి మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి వీసీ అండ్ ఎండీగా నియమించింది. గుంటూరు జిల్లా డ్వామా పీడీగా డిప్యూటీ కలెక్టర్ పి.ఉమాదేవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు డ్వామా పీడీగా నియమించిన ఏ కుమార్‌ని ప్రిన్సిపల్ సెక్రెటరీ(పీవోఎల్ఎల్) వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించింది. గతంలో బాపట్ల ఐసీడీఎస్ పీడీగా సీహెచ్ సుధారాణిని నియమించిన ప్రభుత్వం ఆ ఉత్తర్వులను రద్దు చేసి ఆమెను ప్రభుత్వ సాధారణ ఆస్పత్రులకు అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.

రూ.4 కోట్లతో పరారైన మహిళ

పెదకాకాని, ఫిబ్రవరి 6: నమ్మకంగా ఉంటూ అందరి వద్ద వడ్డీకి డబ్బులు తీసుకొని రూ.4 కోట్లతో మహిళ పరారైన ఘటన మంగళవారం వెలుగు చూసింది. సుమారు 30 మంది బాధితులు పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు కాకాని రోడ్డులోని వాసవినగర్‌కు చెందిన పి.రజిని అనే మహిళ నివాసం ఉంటోంది. అందరితో మంచిగా ఉంటూ వడ్డీ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఇటీవల బాధితులకు డబ్బులు చెల్లించకపోవడంతో ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆ మహిళ ఇంట్లోంచి పరారైంది. కొద్దిరోజులుగా కనపడకపోవడంతో బాధితులు పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు

ఎయిడెడ్ పోస్టుల అక్రమాలపై విచారణ జరిపించాలి

● ఏపీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి6: జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను అమ్ముకుంటూ నిరుద్యోగ ఉపాధ్యాయుల్ని మోసం చేస్తున్న యాజమాన్యాలపై, అక్రమాల్ని ప్రోత్సహించే విద్యాశాఖ అధికారులపై విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బ్రాడీపేటలోని ఓ హోటల్లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలుగరాదనే భావంతో న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను యాజమాన్యాలు తమకు అనుకూలంగా మార్చుకున్నారని పేర్కొన్నారు. ఒక్కో ఉపాధ్యాయ పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేసి పోస్టింగ్ ఆర్డర్లు ఇప్పించుకునేందుకు విద్యాశాఖ చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. విద్యాశాఖలో అక్రమాలపై పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ నాయకుడు రామనాథం అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. ఫెడరేషన్ నాయకుడు టి.వీరయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ తుంగలో తొక్కి, వెనుకబడిన అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు ఐ.పున్నారావు, మోహన్ బుజ్జి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబాటు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 6: వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో 20 ఏళ్ల వెనుక్కు తీసుకుపోయారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు సంబంధించి 16 సంక్షేమ పథకాలు రద్దుచేశారని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ రద్దుచేయటం వల్ల 17 వేలమంది గిరిజన విద్యార్థులు రోడ్డున పడ్డారని అన్నారు. ల్యాండ్ పర్చేజ్ స్కీమ్, గిరిపుత్రిక పథకం తీసివేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో 500 మంది జనాభా కలిగిన గూడేలను ప్రత్యేక పంచాయితీలు చేస్తే జగన్‌రెడ్డి ఆ గ్రామాలకు నిధుల ఆపేశారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలెకల ఐటీడీఏ పీవోలు అవినీతి విచ్చలవిడిగా చేస్తున్నారని అన్నారు. ఇలాంటి చెత్త ముఖ్యమంత్రి భారతదేశంలో ఎక్కడా లేరని అన్నారు రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి ఓడిపోతేతప్ప రాష్ట్రానికి న్యాయం జరగదన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిన్నానాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు సింహాద్రి గంగాధరరావు, సభ్యుడు సుంకర ఉమామహేశ్వరరావు, మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,22,285 మిర్చి టిక్కీలు రాగా అందులో 1,19,344 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జేడీ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 83,823 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	16500	18500
334	9600	20500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	9500	18000	తేజ	8000	21500
273	12500	18900	బ్యాడిగి	10000	20600
341	9000	20500	దేవనూరుడీలక్స్	11000	18500
4884	13000	17500	తెల్లకాయలు	5000	12500

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పల్నాడుకు చెందిన నిందితులు.. తెలంగాణలో దొంగతనాలు

వైరా/తల్లాడ, ఫిబ్రవరి 6: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఖమ్మం జిల్లా వైరా సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. లిఫ్టు ఇస్తామని నమ్మించి కారులో బొమ్మాబొరుసు ఆట పేరుతో మోసం చేసి వృద్ధ దంపతులపై దాడిచేసి బంగారు గొలుసుతో పరారైన పల్నాడు జిల్లాకు చెందిన దొంగల ముఠాను అరెస్టు చేశామని వైరా ఏసీపీ రెహ్మాన్ తెలిపారు. సీఐసాగర్‌తో కలిసి మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలిపారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన బండారు ఏడుకొండలు, నాగేశ్వరరావు, అచ్చన్న అలాగే సత్తెనపలికి చెందిన బిట్రా హన్మంతరావు, లావుడ్యా శ్రీవాసరావునాయక్‌ను అరెస్టు చేసి వారి నుంచి ఏపీ07టీవీ1659 వాహనం, రూ.1.20లక్షల మూడుతులాల బంగారు నాంతాడును, మూడు ఆటబిళ్లలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరుగురు దోపిడీ దొంగల్లో ఒక తండ్రి, ఇద్దరు కుమారులున్నారు. దొంగల ముఠా నాయకుడు బండారు ఏడుకొండలతోపాటు కుమారుడు నాగేశ్వరరావు, తిరుపతిరావు కూడా దోపిడీలో భాగస్వాములుగా ఉన్నారు. తిరుపతిరావు పరారీలో ఉన్నాడు. మంగళవారం చింతకాని మండలంలోని జగన్నాథపురం క్రాస్‌రోడ్డు వద్ద వీరు పట్టుబడ్డారు. తెలంగాణలోని నాగార్జునసాగర్‌లో 2019లో ముఠా దోపిడీకి పాల్పడింది. అలాగే ప్రకాశం జిల్లా ఇంకొల్లులో నాలుగు, ముళ్లపాడులో రెండు, అద్దంకిలో రెండు, యడ్లపాడు, విజయవాడ పడమట, అమర్తలూరులో ఒక్కో దోపిడీ కేసు నమోదైంది. చివరిగా గత ఏడాది సెప్టెంబరులో ఇంకొల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనానికి సంబంధించి అరెస్టైన ఈ ముఠా జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తెలంగాణలో దొంగతనాలు, దోపిడీలకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. దానిలో భాగంగానే సత్తెనపల్లిలోని శ్రీఉమామహేశ్వర ఆటో కన్సల్‌టెన్సీ ద్వారా పైన పేర్కొన్న ఒక సుమోను కొనుగోలు చేశారు. ఏపీలో దొంగతనాలు, దోపిడీలు, మోసాలు చేస్తూ పోలీసులకు దొరికిపోతున్నామని భావించి తెలంగాణ రాష్ట్రాన్ని దొంగతనాలకు ఎంపిక చేసుకొని 2న వైరా బస్టాండ్‌కు చేరుకుని వృద్ధ దంపతులను లిఫ్టు ఇస్తామని నమ్మించి మూడు బిళ్లలాటతో మోసం చేసి నాంతాడు, నగదు కాజేసి వారిని సుమోలోనుంచి బయటకు నెట్టివేసి పరారయ్యారు. సీఐ సాగర్, తల్లాడ, ఎస్ఐలు బి.కొండల్‌రావు, మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటుచేసి కేవలం మూడురోజుల్లోనే సీసీ కెమెరాల ఆధారంగా కేసును చేధించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

విధుల్లో చేరిన ఎన్నికల తహసీల్దార్లు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి మండలాలు, ఇతర పోస్టింగ్‌లు కల్పించారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి ఆయా తహసీల్దార్లు అక్కడ రిలీవింగ్ అయిరాగా వారికి వెనువెంటనే కొత్త కొలువులు కేటాయించారు. ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన పీ మధుసూదనరావుకు తాడికొండ, కే వెంకటేశ్వరరావుకు మంగళగిరి, కే రవీంద్రరెడ్డికి గుంటూరు పశ్చిమ, పీ పార్వతికి కాకుమాను, కే రవిబాబుకు దుగ్గిరాల, టీ శ్రీనివాసులుకు వట్టిచెరుకూరు మండలాల తహసీల్దార్లుగా పోస్టింగ్ కల్పించారు. అలానే ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు నుంచి వచ్చిన ఎస్ శ్రీనివాసులురెడ్డికి తెనాలి, ఈ రమాదేవికి చేబ్రోలు, వీ సుధీర్‌కి తుళ్లూరు, ఎస్ శ్రీనివాసులుకు కొల్లిపర, కే జయజయరావుకు తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవో, కే రాజ్యలక్ష్మికి మేడికొండూరు, ఆర్ సూర్యనారాయణసింగ్‌కి పొన్నూరు, షేక్ షఫీ మాలిక్‌కి కలెక్టరేట్ ఏవో, టీ విజయకుమార్‌కి కలెక్టరేట్ సూపరింటెండెంట్, జీ రాఘవేంద్రరావుకు ప్రత్తిపాడు, పీ శాంతకుమారికి కలెక్టరేట్ సూపరింటెండెంట్ పోస్టులు కల్పించారు. వారంతా ఆయా పోస్టుల్లో విధుల్లోకి చేరి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కి రిపోర్టు చేశారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ వార్షిక బడ్జెట్ ఆమోదం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6: గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సవరణ బడ్జెట్ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను మంగళవారం ఆమోదించారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు రూ.47,72,07,425లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.61,07,16,262ల బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ సభ్యులు డీఈవో పి.శైలజ, డీపీవో కుసుమ శ్రీదేవి, బి. జగన్మోహనరావు, అబ్దుల్ రఫీక్, కె.ఝాన్సీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే కఠిన చర్యలు

● కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 6 : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ 2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్‌వోలు, సూపరింటెండెంట్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తులసీ ధర్మచరణ్, శ్రీకాంత్, వేణుగోపాల్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 6: గోరంట్లలో పోలేరమ్మ తల్లి దేవస్థానం 7వ వార్షిక వేడుకలు వైభవంగా మంగళవారంతో ముగిశాయి. గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ నేతృత్వంలో ఈనెల 4వ తేదీ నుంచి పంచామృతాభిషేకంతో ప్రారంభమై అష్టోత్తర శతనామావళి కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తులసీ ధర్మచరణ్, రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్‌లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, యర్రంశెట్టి సూరి, డాక్టర్ కంతా జగదీష్, తాళ్ళ నాగరాజు, వేద సీడ్స్ జీఎం తోట రంగారావు, డీజీఎం దావులూరు నాగబాబు, తెల్లప్రోలు వెంకటరావు, గాజుల సాయిరామ్, పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.

గాయపడిన కార్యకర్తలకు ఎంపీ ఆర్థిక సాయం



కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎంపీ బాలశౌరి


గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 6: జనసేన పార్టీ ర్యాలీలో పాల్గొని రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న చుండూరు త్రినాథ్, పవన్ అనే కార్యకర్తలను మంగళవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి పరామర్శించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. గత ఆదివారం ఎంపీ బాలశౌరి ర్యాలీగా గుంటూరు నుంచి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో త్రినాథ్‌కు తీవ్రగాయాలు కాగా, పవన్ స్వల్పంగా గాయపడ్డారు. మంగళవారం ఆస్పత్రికి వచ్చి వీరిని పరామర్శించిన బాలశౌరి త్రినాథ్‌కు రూ.50 వేలు, పవన్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబసభ్యులకు అండగా ఉంటానని ఎంపీ హామీ ఇచ్చారు.

నేడు బ్రాడీపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఫిబ్రవరి 6: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రాడీపేట 4వ లైనులో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి 8 సెక్షన్ ఏఈ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

డీవీటీ రోగులకు వరం.. 'థ్రాంబో సక్షన్' థెరపీ

● కార్డియాలజిస్ట్ డాక్టర్ నారాయణరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరెడ్డి, పక్కన శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 6: కాలి సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడిన రోగులకు కొత్తగా అందుబాట్లోకి వచ్చిన థ్రాంబో సక్షన్ థెరపీతో పూర్తిగా నయం చేయవచ్చని కార్డియాలజిస్ట్ డాక్టర్ బీవీ నారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం అరండల్‌పేటలోని శ్రీహాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (డీవీటీ) అనే వ్యాధికి గురైన రోగుల్లో కాలిలి సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడతాయని ఆయన తెలిపారు. రోగుల్లో కాలు వాపు, నొప్పి, ఆయాసం, బీపీ పెరగడం వంటి సమస్యలు ఏర్పడతాయని, ఈ గడ్డలను వెంటనే కరిగించకపోతే రోగికి ప్రాణాపాయం ఉంటుందన్నారు. ఇటీవల కొత్తగా అందుబాట్లోకి వచ్చిన వైద్య చికిత్స థ్రాంబో సక్షన్‌గా ఆయన వెల్లడించారు. ఈ పద్ధతిలో రోగి కాళ్లల్లో ఏర్పడిన రక్తం గడ్డలను సన్నటి సక్షన్ అనే వైరు వంటి పరికరం కాలిలోకి పంపి నెగెటివ్ ప్రెజర్ యాస్పిరేషన్ ద్వారా ఆ గడ్డలు (థ్రాంబస్) తొలగిస్తామని ఆయన తెలిపారు. గుంటూరులో తొలిసారిగా శ్రీహాస్పిటల్‌లో ఈ వైద్యం అందుబాట్లోకి తెచ్చామన్నారు. ఈ చికిత్స పొందిన ఒంగోలుకు చెందిన గడ్డం శ్రీనివాసరావు(43) వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు రైల్వేస్టేషన్‌కి మల్టీట్రాకింగ్ కనెక్టివిటీ

● మెడికల్ కాలేజ్ సమీపంలో సెలూన్ సైడింగ్, ఏఆర్‌టీ నిర్మాణం
● కంకరగుంట ఆర్‌యూబీ నుంచి రెండు స్టేబుల్‌లేన్ల ఏర్పాటు
● తీరనున్న ప్లాట్‌ఫాం లభ్యత కష్టాలు



గుంటూరు రైల్వేస్టేషన్ మెడికల్ కాలేజ్ వైపున సెలూన్ సైడింగ్ నిర్మాణం కోసం ప్రారంభమైన పనులు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్‌కి మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ సదుపాయాన్ని రైల్వేశాఖ ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు సెలూన్ సైడింగ్, ఏఆర్‌టీ, మెడికల్ వ్యాన్‌లు రైల్వేస్టేషన్ నుంచి డొంకరోడ్డు వైపున ఉన్న కోచ్ మెయింటెనెన్స్ డిపో సమీపంలో ఉండగా ఇప్పుడు కొత్తగా స్టేషన్‌కు మెడికల్ కళాశాల వైపున ఏర్పాటు చేస్తుంది. శిథిలమైన రైల్వే క్వార్టర్స్‌ని కూల్చివేసి ఆ స్థలంలో వీటి నిర్మాణాన్ని తలపెట్టింది. రైల్వే జీఎం, డీఆర్‌ఎం, సీఆర్‌ఎస్ స్థాయి అధికారులు వచ్చినప్పుడు వారి ఇన్‌స్పెక్షన్ వ్యాన్ కోసం ఒక ప్లాట్‌ఫాం మొత్తం రైళ్ల రాకపోకలను నిలిపేయాల్సి వస్తున్నది. దీని వల్ల ప్లాట్‌ఫాం సమస్యలు ఉత్పన్నం అవుతుండటంతో ఆ కష్టాలు తొలగించేందుకు సెలూన్ సైడింగ్, ఏఆర్‌టీ, మెడికల్ వ్యాన్‌ల కోసం సైడింగ్‌లను నిర్మాణం చేపట్టింది. ఇందు కోసం రూ.50 కోట్ల వరకు నిధులను వెచ్చిస్తున్నది.

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అత్యంత కీలకమైనదిగా గుంటూరు రైల్వే జంక్షన్ ఉన్నది. ఇప్పటికే విజయవాడ, తెనాలి మార్గాల్లో రెండు వరసల ట్రాక్‌ల నిర్మాణం జరిగింది. నల్లపాడు వైపున కూడా డబుల్ లేన్ ఉన్నది. త్వరలో నడికుడి రైలుమార్గం డబ్లింగ్ జరుగనున్నది. నంద్యాల మార్గంలో రెండు వరసల ట్రాక్ నిర్మాణం చాలావరకు పూర్తయింది. ఈ నేపథ్యంలో రైళ్ల, గూడ్స్‌ల రాకపోకలు మరింతగా పెరగనున్నాయి. అలానే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఆగిపోయే రైళ్లను స్టేబుల్ (పార్కింగ్) చేయడానికి అవసరమైన లేన్లు లేవు. దీంతో బండారుపల్లి, సిరిపురం, వేజండ్ల వంటి రైల్వేస్టేషన్లకు ఖాళీ రైళ్లను తీసుకెళ్లి స్టేబుల్ చేసి నిర్ణీత సమయానికి తీసుకొస్తున్నారు. దీని వల్ల ఆయా స్టేషన్లలో క్రాసింగ్‌ల సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు స్టేబుల్ లేన్లు నిర్మించడానికి రైల్వేశాఖ ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నది. ఎన్‌జీవో అసోసియేషన్, హాల్ వద్ద స్థలం కోసం రెవెన్యూ శాఖకి ప్రతిపాదించింది. అయితే అనుమతులు రావడం ఆలస్యం కావడంతో రైల్వే వద్ద అందుబాటులో ఉన్న స్థలంలోనే రెండు స్టేబుల్ లేన్ల నిర్మాణాన్ని తలపెట్టింది.

కంకరగుంట ఆర్‌యూబీ నుంచి మెడికల్ కాలేజీ వరకు వీటిని నిర్మించబోతున్నారు. ఇందుకు సంబంధించి భూమి చదును చేసే పనులు, సిమెంట్ శ్లాబుల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గరిష్ఠంగా ఆరు నెలల వ్యవధిలో ఈ స్టేబుల్ లేన్ల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైల్వేవర్గాలు భావిస్తున్నాయి. ఏఆర్‌టీ, మెడికల్ వ్యాన్‌లు ఇటు వైపున ఉంటే ఏదైనా ప్రమాదం జరిగితే వేగవంతంగా సంఘటన స్థలికి చేరుకొనే అవకాశం ఉంటుంది.

ఓటర్ కార్డులు అడుగుతున్న వలంటీర్లను నిలదీయాలి

● పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర



ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో నాని, టీడీపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఓటరు కార్డులు అడిగే వలంటీర్లను నిలదీయాలని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్న వైసీపీ నేతలు బరితెగించి వలంటీర్ల ద్వారా ఓటర్ కార్డులు అడిగుతున్నారని, ఇప్పటికే పార్టీ, కులాల వారీగా వారిని ధ్రువీకరించుకుని టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను తొలగించే దుష్టపన్నాగానికి వైసీపీ వడిగట్టిందని ఆరోపించారు. గుంటూరు పశ్చిమ ప్రజలు ఎవరూ వలంటీర్లకు ఎటువంటి సమాచారం ఇవ్వొద్దని, ముఖ్యంగా ఓటర్ కార్డులను ఇవ్వొద్దని ఆయన చెప్పారు. తాజాగా చిలకలూరిపేట నుంచి కూడా కొత్తగా ఓట్లను పశ్చిమలో చేర్చుతున్నారని, దీని వెనుక ఉన్న అసలు కుట్ర కోణాన్ని అతిత్వరలో ఛేదిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిశీలకులు సింహాద్రి కనకాచారి, ఈరంటి వరప్రసాద్, మానం శ్రీనివాస్, కొమ్మినేని కోటేశ్వరావు, కసుకుర్తి హనుమంతరావు, రాజీవ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

● ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం

టీడీపీ జిల్లా కార్యాలయంలో రవీంద్ర ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఓటర్ జాబితా పరిశీలన, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, టెలిగ్రామ్ బాట్, మన టీడీపీ యాప్ గురించి శిక్షణ ఇచ్చారు. రావిపాటి సాయికృష్ణ, చింతకాయల వెంకటసాయి, పంచుమర్తి శేషులు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

తొలిసారి ఓటు పొందిన యువతను చైతన్యపరచాలి

పశ్చిమ నియోజకవర్గ పరిధిలో తొలిసారి ఓటు హక్కు పొందిన యువతను చైతన్యపరచాలని కోవెలమూడి రవీంద్ర పిలుపునిచ్చారు. పార్టీ పశ్చిమ కార్యాలయంలో మంగళవారం ఆయన 'మై ఫస్ట్ ఓట్ టూ సీబీఎన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో అమలు చేస్తున్నారని తెలిపారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణ కోసం పశ్చిమ నియోజకవర్గంలో 9మందితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బృందంలో తనతో సహా జ్యోతుల మురళీకృష్ణ, పోపూరి నరేంద్ర, ఉప్పల రామారావు, రాయపాటి అమృతరావు, కుంచకచర్ల దర్మతేజ, జెట్టి జానకీరామయ్య తులసి మౌలిక, నేపాక పద్మావతి ఉన్నారు.

బటన్ నొక్కుడు సరే.. ఖాతాల్లోకి డబ్బులేవి?

● నిమ్మల శేషయ్య



గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బటన్ నొక్కుడు సరే.. లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులేవి జగన్‌రెడ్డి అంటూ టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య ప్రశ్నించారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల కోసం 122 సార్లు బటన్ నొక్కానని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్ తర్వాత ఎంతమంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమవుతున్నాయో కూడా నిజం చెప్పాలని డిమాండ్ చేశారు. జనవరి 23న ఆసరా 4వ విడత నిధులు విడుదల అంటూ బటన్ నొక్కినా ఇప్పటివరకు ఎందుకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడలేదో సమాధానం చెప్పాలన్నారు. జగన్ బటన్ నొక్కుడు సంక్షేమం ఎంత అబద్ధమో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. ఎన్నికలకు సిద్ధమంటున్న జగన్ ఊరూరా తిరుగుతూ చేయబోయేది అబద్ధాల యుద్ధమే అని ఇప్పటికే తెలుగుదేశం పార్టీ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. బటన్‌నొక్కా అని చెబుతూ డ్వాక్రా మహిళల ఖాతాల్లో నిధులు జమ చేయకుండా జగన్ తనంతట తనే అందుకు ఆధారాలు అందించాడని ఎద్దేవా చేశారు. ఆసరా ఒక్కటే కాదు, జగన్ ఇప్పటి వరకు ఇదేరీతిలో రైతుల నుంచి విద్యార్థుల వరకు బటన్ నొక్కుడు పేరుతో మోసం చేస్తున్నారని, ప్రచారానికి వాస్తవానికి పొంతన ఉండడం లేదన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్లు జమకాక ఎంతో మంది చదువులు ప్రమాదంలో పడ్డాయన్నారు.

క్రైస్తవులను మోసం చేస్తున్న జగన్‌రెడ్డి

● టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయారత్నం

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మత రాజకీయాలను అడ్డుపెట్టుకుని క్రైస్తవ సమాజాన్ని జగన్‌రెడ్డి మోసం చేస్తున్నాడని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిమెట్ల దయారత్నం ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎస్సీ సెల్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ రాక్షస పాలనలో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టటమే కాక ప్రస్తుతం మత రాజకీయాలు కూడా మొదలుపెట్టారని అన్నారు. నాడు జగన్‌రెడ్డి గెలుపు కోసం తల్లి, చెల్లి బైబిల్ పట్టుకొని చేసిన ప్రచారం వల్ల మోసపోయిన క్రైస్తవ సమాజం వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే, నేడు జగన్‌రెడ్డి తన మేనత్త అయిన విమలారెడ్డిని ప్రచారాలకు వాడుకోవటం మరోబలి పశువును సిద్ధం చేయటమేనని అన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల సుశీలరావు మాట్లాడుతూ అబద్ధపు ప్రచారాలను, అవాస్తవాలను క్రైస్తవులు నమ్మే పరిస్థితిలో లేరని, రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని తేల్చి చెప్పారు. సమావేశంలో బత్తుల భాస్కర్, మేళం సైదయ్య, పాటిబండ్ల బలరాం, హుస్సేన్, సుందరంబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

10న రాజ్యశ్యామల మహాయజ్ఞం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6: భవతారిని ట్రస్ట్, హైదరాబాదు ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదిన ఏటుకూరు బైపాస్ రోడ్డు, కామేశ్వరరావు మైదానంలో రాజ్యశ్యామల మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు గుడివాడ, మాజీ మున్సిపల్ చైర్మన్ లంకా దాసరి ప్రసాదరావు తెలిపారు. మంగళవారం మహాయజ్ఞంకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాయజ్ఞంలో భాగంగా గోపూజ, సుప్రభాత సేవ, లలిత సహస్రనామ లక్ష కుంకుమార్చన, సహస్ర పారాయణంతో పాటు అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సం ఘ నగర మాజీ అధ్యక్షులు మున్నలూరి గౌరిశంకర్, కిరణా మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాజేంద్రప్రసాదు, బి.సాంబశివరావు తదిత రులు పాల్గొన్నారు.

వ్యాపార సంస్థలకు లైసెన్స్ తప్పనిసరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6: వ్యాపార సంస్థలకు, దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీని వాస్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కావున వ్యాపారులు విధిగా లైసెన్స్ తీసుకోవాలని, నమోదు ప్రక్రియ ఈనెల 29వ తేదితో ముగుస్తుందని వివరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకై సమీప వార్డు సచివాలయాలను లేదా 9492555157 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

వైసీపీని తరిమేద్దాం : నసీర్



బాబు ష్యూరిటీ పత్రాలు ఇస్తున్న నసీర్, టీడీపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి వైసీపీని తరిమేద్దామని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని బుచ్చయ్యతోటలో మంగళవారం ఆయన 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ యువత, విద్యార్థుల భవిష్యత్తు కోసం, అన్ని వర్గాల అభివృద్ధికి అందరూ టీడీపీకి ఓటేసి వైసీపీని ఇంటికి సాగనం పాలన్నారు. కార్యక్రమంలో నేతలు సోమశేఖర్, వేములకొండ శ్రీనివాస్, బలరాం, మస్తాన్‌రావు, మణి, శంకర్, వాణి, కార్పొరేటర్లు భారతి, సమత తది తరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టంతోనే బీసీలకు సంరక్షణ

మినీ మ్యానిఫెస్టోలో టీడీపీ అధినేత ప్రకటించిన బీసీ రక్షణ చట్టంతోనే బీసీలకు సంరక్షణ లభిస్తుందని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని శ్రీరామయ్య ఫంక్షన్ హాల్లో మంగళవారం యాదవ, నాయి బ్రాహ్మణ, కుమ్మరి వర్గాలతో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నసీర్, తాళ్ల వెంకటేష్ యాదవ్, గుడిపల్లి నాగేశ్వరరావు, వేములకొండ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ టీడీపీకి అండగా ఉన్నారనే కారణంగా బీసీ నేతలను అరెస్టు చేసి భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. బీసీ కార్యకర్తలను కిరాతకంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు అడక శ్రీనివాసరావు, పేరయ్య, వెంకట్, యాదాల శ్రీనివాసరావు, బుజ్జి, ప్రభాకర్, కిరన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం నిల్వలు ప్రభుత్వ పోర్టల్‌లో పొందుపరచాలి

● జేసీ రాజకుమారి

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యాపారులు, చిల్లర వర్తకులు, పెద్ద రిటైలర్లు, ప్రాసెసర్లు, మిల్లర్లు తమవద్దనున్న ధాన్యం, బియ్యం వివరాలను ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. పై జాబితాలో ఉన్న వారందరూ ప్రతిఒక్కరూ తమ వద్ద నున్న బియ్యం, నూకలు, బాస్మతి కాని తెల్లబియ్యం, పారా బాయిల్ రైస్, బాస్మతి బియ్యం నిల్వల వివరాలను ప్రతి శుక్రవారం ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. సంబంధిత అధికారులు తనిఖీ చేసే సమయంలో పై విషయాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

గ్రామ ప్రథమ పౌరుడికిచ్చే గౌరవం ఇదేనా..?

● సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు



సర్పంచులను పరామర్శిస్తున్న చిలకలపూడి పాపారావు, జాస్తి వీరాంజనేయులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6: చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా శాంతియుతంగా అసెంబ్లీకి వెళ్తున్న సర్పంచులపై పోలీసుల దురుసుప్రవర్తన హేయమని సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు మండిపడ్డారు. గ్రామప్రథమ పౌరుడిగా భావించే సర్పంచులను ఈడ్చి కెళ్ళి బస్సుల్లో పడవేసే ఘటనలు తీవ్రంగా కలిచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ వద్ద అరెస్టు చేసి నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించిన సర్పంచులను అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులుతో కలసి ఆయన పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికి నిరసన తెలిపే హక్కు ఉంటుందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా కాలరాయడం ఏమాత్రం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలు మానుకొని సర్పంచులతో కమిటీని ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

సర్పంచుల పోరాటం అభినందనీయం

● టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు



సర్పంచుల అరెస్టుపై పోలీసుల నుంచి వివరాలను అడిగి తెలుసుకుంటున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెట్టిన ఇబ్బందులను లెక్కచేయకుండా అసెంబ్లీ ముట్టడికి యత్నించిన సర్పంచులను అభినందిస్తున్నట్టు టీడీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి బూర్ల రామాంజనేయులు అన్నారు. అసెంబ్లీ వద్ద అరెస్టు చేసి నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించిన సర్పంచులను నియోజకవర్గ పరిశీలకులు భీమాదేవి వందనాదేవి, టీడీపీ, జనసేన కార్యకర్తలతో కలసి ఆయన పరామర్శించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన పంచాయతీలను సరైన దారిలోకి తీసుకురావాలంటే చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి లీలామల్లేశ్వరరావు, షకూర్, మస్తాన్, గోవిందురాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలం ఒప్పందాల జీవోలను విడుదల చేయాలి

● కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6: మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారానికై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెలో ఉన్నప్పుడు ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్ జీతాలు చెల్లింపుకై తొమ్మిది మంది అధికారులతో కమిటీ వేశారని ఈ కమిటీ వారం రోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలని ఆ మెమోలో పేర్కొన్నప్పటికీ 25 రోజులు అవుతున్నా ఇప్పటివరకు ఆ కమిటీ నివేదిక బహిర్గతం చేయలేదని మండిపడ్డారు. అలాగే క్లబ్ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి జనవరి నెలాఖరులోపు అధికారులు కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు యూనియన్ నాయకులతో కలిపి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పి, నేటికీ ఆ సమావేశం జరపలేదని అన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలను జీవో రూపంలో విడుదల చేయా లని లేనిపక్షంలో మరో ఆందోళనకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. నిరసనల్లో యూనియన్ నాయకులు రాచూరి వేణు, ఎం రవి, పూనేపల్లి శ్రీనివాసరావు, కె.వెంగమ్మ, డేవిడ్, మంగమ్మ, పేరం పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్సీ సొల్యూషన్స్‌తో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 6 ఐపీఎస్సీ సొల్యూషన్స్(కేరళ)తో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సంస్థ చైర్మన్ డాక్టర్ మెండస్ జాకోబ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మంగళవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. దీని ద్వారా బెస్ట్ ఎడ్యుకేషన్ విద్యా విధానం ప్రశ్నపత్రాల రూపకల్పన ద్వారా అధ్యాప కులు మరింతగా నిష్ణాతులుగా మారవచ్చునని ప్రముఖ విద్యావేత్త, ఐపీఎస్సీ సొల్యూషన్స్ (కేరళ) చైర్మన్ డాక్టర్ మెండస్ జాకోబ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఖజానా ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి



డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6: ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఖజానాశాఖ ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో కార్యాలయంలో డీఆర్వో పెద్ది రోజాకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం చాంద్ బాషా మాట్లాడుతూ ఖజానాతో పాటు ఇతర కీలక మైన శాఖ ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయిం చవద్దని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు వై నాగేశ్వరరావు, హేమలత, సుల్తానా, నీలిమా, లీలాబాయి. ఖజానా జిల్లా ఉద్యోగులు శ్రీనివాసరెడ్డి, రోజా, శర్మ, నాగరాజు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

గుంటూరు సిటీ కాపురస్తులైన తాడికొండ లీలా వెంకట వీరాంజనేయులు, తండ్రి రామకృష్ణ వారి సంజాయిషీ పొంది తెలియజేయునది. నా క్లయింట్ కుమారుడైన **తాడికొండ పార్థ మణి వెంకట పవన్ కుమార్**, 8 సంవత్సరాల క్రితం వివాహము చేసుకొని ఉన్నాడు. అప్పటి నుండి నా క్లయింటు కుమారుడు, అతని భార్య వారి సంతానముతో వేరే కాపురం ఉంటూ నా క్లయింట్ చేయు వ్యాపారములకు ఎట్టి సంబంధం లేకుండా ఉండియున్నాడు. ఇటీవల కాలంలో సుమారు కొద్ది మాసముల నుండి నా క్లయింట్ కుమారుడైన **తాడికొండ పార్థ మణి వెంకట పవన్ కుమార్** దుర్వ్యసనాలకు బానిసై మరియు చాలా మంది వద్ద ఋణ సదుపాయం పొంది తను స్వంతముగా వ్యాపారము చేయుచు బాకీ పడివున్నాడని నా క్లయింట్‌కు తెలిసివున్నది. ఇట్టి స్థితిలో నా క్లయింట్ కుమారుడైన తాడికొండ **పార్థ మణి వెంకట పవన్ కుమార్** చేయు వ్యాపారమునకు, అతను చెల్లించవలసిన బాకీలకు నా క్లయింటుకు ఏవిధమైన సంబంధం లేదని, అట్లే నా క్లయింట్‌కు తన కుమారుడైన తాడికొండ పార్థ మణి వెంకట పవన్ కుమార్‌కు దేహ సంబంధం తప్ప ఇతరితర వ్యవహారములకు నా క్లయింట్‌కు బాధ్యత లేదు.

ఇట్లు : మట్టుపల్లి వెంకట సుబ్బారావు, అరండల్‌పేట 9వ లైను, గుంటూరు.

దిక్సూచి
DIKSUCHI

ఎంతటి ప్రశాంతత పాటించే తల్లిదండ్రులైనా, తమ పిల్లలకు పరీక్షలు అంటే ఆందోళన చెందడం సహజం. పరీక్షలంటే ఒత్తిడి ఈ రోజుల్లో విద్యార్థులకే పరిమితం కావటం లేదు. ఆ సెగ పేరెంట్స్‌నూ తాకుతోంది. అందుకే పరీక్షల సమయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. యావత్తు వాతావరణాన్ని కూల్‌గా ఉంచాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని కూడా చెబుతున్నారు. అధిక ఒత్తిడిలో పిల్లలు ఆందోళన చెందకుండా ఉండాలన్నా, పరిస్థితులు చల్లబడి పరీక్షలకు అనుగుణమైన సానుకూల వాతావరణం ఏర్పడాలన్నా తల్లిదండ్రులు ఇతోధిక పాత్ర పోషించాల్సి ఉంటుంది. అందుకు కొన్ని సూచనలు...

పరీక్షల సమయంలో పేరెంట్సే మెంటార్స్



ప్రిపరేషన్ నుంచి తమ పిల్లలు దృష్టితప్పకుండా చూసుకోవాలి. అంటే టీవీ షోలు చూడడం, పెద్ద సౌండ్‌తో సంగీతం పెట్టడం, ఫ్యామిలీ గెట్ టుగెదర్స్, పిక్నిక్‌లు, కమ్యూనిటీపరంగా కలవడాలు, మొబైల్, వీడియో గేమ్స్, చిట్‌చాట్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలి.

■ ప్రతి విద్యార్థిలో కొన్ని ప్రత్యేక లేదా కొనియాడదగ్గ లక్షణాలు ఉండి తీరతాయి. అవేంటో తల్లిదండ్రులకే ఎక్కువ తెలుస్తాయి. పరీక్షలకు తమ పిల్లలు సన్నద్ధమవుతున్న సమయంలో తల్లిదండ్రులు వారి వెంట ఉంటే అద్భుతాలను రాబట్టవచ్చు. మానసికంగా, ఉద్వేగపరంగా వారికి బాసటగా నిలిచినట్లవుతుంది. ముందు పేర్కొన్నట్టు విద్యార్థి బలాన్ని అర్థం చేసుకుని, ప్రోత్సహిస్తే బాగుంటుంది. అదే సమయంలో మరొకరితో పోలికలు తేవద్దు. ఒక సబ్జెక్టులో వీక్‌గా ఉన్నా మరికొన్నింటిలో బలంగా ఉండొచ్చు. అందుకని ఆ అమ్మాయి/అబ్బాయిలా అంటూ పోల్చి మాట్లాడటంతో వ్యతిరేక ప్రభావాలు కలుగుతాయని తల్లిదండ్రులు గుర్తించాలి.

■ తల్లిదండ్రులు ఎన్నడూ తమ ఆలోచనలు, ఆకాంక్షలను పిల్లలపై రుద్దకూడదు. పరీక్షలకు ఉన్న ప్రాధాన్యం తెలియజేయాలి. అందుకు అనుగుణంగా వారిని సన్నద్ధం చేయాలి. పరీక్షలే వారి భవితను నిర్దేశిస్తాయని చెప్పకూడదు.

■ పరీక్షల సమయంలో పేరెంట్స్ మెంటార్ల మాదిరిగా వ్యవహరించాలి. పరీక్షకు ఉద్దేశించిన సిలబస్ మొత్తం కవర్ అయ్యేలా స్టడీ షెడ్యూల్ రూపొందించుకునేలా సహకరించాలి. దీంతో తమ అబ్బాయి/అమ్మాయికి ఫోకస్ అలాగే స్పష్టత పెరుగుతుంది. అదే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పరీక్షల్లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు దోహదడుతుంది.

ఎగ్జామ్ టైమ్

■ ప్రిపరేషన్ నుంచి తమ పిల్లలు దృష్టితప్పకుండా చూసుకోవాలి. అంటే టీవీ షోలు చూడడం, పెద్ద సౌండ్‌తో సంగీతం పెట్టడం, ఫ్యామిలీ గెట్ టుగెదర్స్, పిక్నిక్‌లు, కమ్యూనిటీపరంగా కలవడాలు, మొబైల్, వీడియో గేమ్స్, చిట్‌చాట్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలి.

■ సరైన పౌష్టికాహారం చాలా అవసరం. తేలికగా అరిగే ఆహారం అందించాలి. పండ్లు, కూరగాయలు, నట్స్, ఎక్కువగా నీరు - డైట్‌లో ఉండేలా చూడాలి. చిరుతిండి, శీతల పానీయాలు, కెఫిన్ ఉండే డ్రింకులకు దూరంగా ఉంచాలి. ఇవన్నీ మత్తును కలిగిస్తాయి. అది జీవక్రియ మందగించేలా చేస్తుంది. అలాగే ఒత్తిడికి కూడా దూరంగా ఉంచాలి. సరిపోను నిద్రపోయేలా చూడాలి. అదే ఆలోచన, మెమరీని పెంచుతుంది. మెంటల్‌గా ఫోకస్డ్‌గా ఉండేలా చూస్తుంది. నిద్రకు ఉన్న ప్రాధాన్యం తెలుసుకోవాల్సిందే. నిజానికి నిద్ర పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి చాలా అవసరమైనది.

■ వెర్బల్(తిట్టడం) లేదా పనిష్మెంట్స్ అస్సలు వద్దు. శిక్షిస్తే పిల్లల్లో ముఖ్యంగా పెద్దలపై వ్యతిరేక భావన పెరుగుతుంది. భయం కలిగిస్తుంది. చివరకు కోలుకోలేని దెబ్బ తగిలేందుకు దారితీస్తుంది. ఏదో ఒక టాస్క్ ఇచ్చి, పూర్తి చేస్తే అందుకు బహుమతి ఇవ్వడం మంచిది. అది అటు తల్లిదండ్రులు ఇటు పిల్లల మధ్య మంచి పరిస్థితులు నెలకొనేందుకు దారితీస్తుంది.

■ పరీక్ష రోజున కూడా సహాయపడవచ్చు. ముఖ్యంగా పిల్లలు పరీక్ష హాలుకు ఒక అరగంట ముందే చేరుకునేలా చూడాలి. హాల్ టికెట్, స్టేషనరీ పెట్టుకునే పౌచ్, వాటర్ బాటిల్ తదితరాలు ఉన్నాయా లేదా అన్నది చెక్ చేయాలి. పరీక్ష రోజున ఏదైనా తిని వెళ్ళేలా చూడాలి. పరీక్ష రోజుల్లో ఒకటి పూర్తయిన వెంటనే మరొక సబ్జెక్టుపై దృష్టిపెట్టేలా చూడాలి. అయిపోయిన పరీక్షను అక్కడికి వదిలేయమనాలి. బాగా రాసినా, రాయకున్నా అక్కడికి ఆ సబ్జెక్ట్ క్లోజ్ అని చెప్పి ఒప్పించాలి. అంటే రాసిన రోజు పరీక్ష ప్రభావం మరుసటికి క్యారీ ఫార్వార్డ్ కాకుండా చూడగలగాలి. క్రాస్ వెరిఫికేషన్, రాసిన దానిపై చర్చలు ఉండకుండా శ్రద్ధవహించాలి.

■ చివరగా పిల్లలకు పరీక్షల సమయంలో చేదోడు వాదోడుగా ఉండగలిగితే మంచిది, పిల్లలకు తల్లిదండ్రులే మొదటి టీచర్లు, మెంటార్లు, స్నేహితులు, గైడ్స్ అందుకని అడుగడుగునా పిల్లల ఎదుగుదలలో పేరెంట్స్ సహకారం అవసరమవుతుంది. పిల్లలకు సంబంధించి ఎంత సమయం అని ప్రశ్నించుకోవడం కన్నా, వారితో వీలైనంత ఎక్కువసేపు గడిపేందుకు తల్లిదండ్రులు సన్నద్ధం కావాలి. అప్పుడే పిల్లలు పరీక్షలే కాదు, జీవితంలోనూ రాణిస్తారు.

- బూస శశి కుమార్, బైజూస్

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kuZPQm6లో చదవండి.

ఊచకోతకు సిద్ధం



'అలాంటోడు మళ్లీ తిరిగొస్తున్నాడంటే...?' ఎలా ఉండబోతోందో చూసేందుకు డేట్ ఖరారైంది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'ఓజీ' చిత్రం విడుదల తేదీ అధికారికంగా ఖాయమైంది. సెప్టెంబర్ 27న ఈ చిత్రాన్ని విడుదలచేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ మంగళవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను వదిలింది. ఇందులో పవన్ కల్యాణ్ టీ గ్లాస్ పట్టుకొని స్టైలిష్‌గా కనిపించారు. ముంబై-జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డి.వి.వి. దానయ్య నిర్మాత. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, వెంకట్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

గగనంలో ప్రేమపక్షుల ప్రణయ గీతం



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందిన తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. భారత వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్ని, దేశాన్ని రక్షించడానికి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ చిత్రంలో ఆవిష్కరించబోతున్నారు. మానుషి చిల్లర్ కథానాయిక. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకుడు. మార్చి 1న విడుదలవుతోంది. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిత్రబృందం రెండో గీతాన్ని విడుదల చేసింది. 'గగనాల' అంటూ సాగే ఈ గీతంలో హీరో, హీరోయిన్ల మధ్య ప్రణయాన్ని ఆవిష్కరించారు. మిక్కీ జే మేయర్ స్వరపరిచిన ఈ రొమాంటిక్ గీతాన్ని అర్మాన్ మాలిక్ ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "ఆపరేషన్ వాలెంటైన్' మరో స్థాయిలో ఉంటుంది. 130 కోట్ల మంది ప్రజలను తన కుటుంబంగా భావించే సైనికుల త్యాగాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాం' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ "ఆపరేషన్ వాలెంటైన్' అందరూ గర్వపడే అద్భుతమైన సినిమా' అని చెప్పారు.

విహార యాత్రకు వెళ్లినట్లుంది



రవితేజ కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజి విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవితేజకు జోడీగా నటించిన కావ్యాథాపర్ మీడియాతో మాట్లాడారు.

● కార్తిక్ చెప్పిన కథ కొత్తగా, అద్భుతంగా అనిపించింది. హీరో రవితేజ కావడంతో తప్పకుండా 'ఈగల్' సినిమా చేయాలనుకున్నా. ఇందులో యాక్షన్, రొమాన్స్, లవ్ సరికొత్తగా ఉంటాయి. కచ్చితంగా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. ఈ చిత్రంలో నా పాత్ర పేరు రచన. జీవితంలో తనకంటూ కొన్ని లక్ష్యాలు ఉంటాయి.

● రవితేజకు నేను పెద్ద అభిమానిని. ఆయన చాలా పాజిటివ్ ఎనర్జీతో ఉంటారు. సెట్స్‌లో ఉంటే సరదాగా ఉండేది. రవితేజతో పనిచేయడం మర్చిపోలేని అనుభూతి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి సంస్థలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. సినిమాను చాలా గ్రాండ్‌గా నిర్మించారు.


● 'ఈగల్' షూటింగ్ పోలాండ్, లండన్‌లో ఎక్కువగా జరిగింది. విహార యాత్రలకు వెళ్లినట్లు అనిపించింది. చాలా ఎంజాయ్ చేశాను. ప్రస్తుతం 'డబుల్ ఇస్మార్ట్' షూటింగ్ జరుగుతోంది. భవిష్యత్‌లో మాస్, యాక్షన్ సినిమాలు చేయాలనుంది.

ముద్దు సీను.. లీగల్ నోటీసు!



సినిమాల్లో ఇప్పుడు ముద్దు సీన్లు కామన్ అయ్యాయి. తెలుగు సినిమాల్లో హీరోహీరోయిన్లు తెరపై తెగబడి లిప్ టు లిప్ కిస్సులు ఇచ్చుకుంటుంటే ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. 'ముద్దుకు లేదు హద్దు' అని సినిమా వాళ్లు అంటుంటే ఓకే ఓకే అంటూ సెన్సార్ బోర్డ్ కూడా సరిపుచ్చుకుంటోంది. అయితే ఇప్పుడు ఓ సినిమాలో ముద్దు చూసి ఒళ్లు మండిన ఓ మహిళ లీగల్ నోటీసు ఇవ్వడంతో ఆ వార్త వైరల్ అయింది. విషయం ఏమిటంటే ఇటీవల విడుదలైన 'ఫైటర్' చిత్రంలో హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా నటించారు. పనిలో పనిగా వీరిద్దరి మీద ఓ ముద్దు సీన్ కూడా గాఢంగా చిత్రీకరించారు దర్శకుడు. ఆడియన్స్ కూడా ఆ సీన్‌ని ఆస్వాదించేశారు. అయితే ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ గెటప్‌లో ఉండి ఇలా ముద్దు పెట్టుకోవడం చూసి ఆగ్రహించారు వింగ్ కమాండర్ సౌమ్య దీప్ దాస్. ఇలాంటి సన్నివేశం పెట్టడం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌ని, అధికారులను అవమానించడమే అంటూ ఆమె మండిపడి దర్శకనిర్మాతలకు లీగల్ నోటీసు పంపించారు. దీనిపై చిత్ర యూనిట్ స్పందించాల్సి ఉంది.

పన్నెండేళ్ల వైవాహిక బంధానికి వీడ్కోలు



సినీ దంపతులు ధర్మేంద్ర, హేమమాలినిల కుమార్తె ఈషా డియోల్ తన భర్త భరత్ తక్తాని నుంచి విడిపోతున్నారు. ఇక నుంచి తమ మార్గాలు వేర్వేరు అని ఇద్దరూ ఆంగ్ల మీడియాకు వెల్లడించారు. 'ఒకరి అభిప్రాయాలు మరొకరు గౌరవించుకుంటూ తీసుకున్న నిర్ణయం. దీని వల్ల మా ఇద్దరి పిల్లల భవిష్యత్ దెబ్బ తినకూడదు. ఆ విషయంలో పూర్తి జాగ్రత్త వహిస్తాం' అని చెప్పారు ఈషా, భరత్. తల్లి, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ 2002లో హీరోయిన్‌గా చిత్ర రంగం ప్రవేశం చేసిన ఈష కొన్ని సినిమాల్లో నటించారు. ఆ సమయంలోనే వ్యాపారవేత్త భరత్ పరిచయం కావడంతో మనసులు కలసి కొంత కాలం ఆయనతో డేటింగ్ చేశారు. 2012 జూన్ 29న వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన పన్నెండేళ్లకు, ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఈషా, భరత్ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరిద్దరూ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాలీవుడ్‌లో చర్చనీయాంశం అయింది. ఇటీవలే ఓటీటీ వేదిక్కపైకి అడుగుపెట్టిన ఈషా నటిగా కొనసాగుతుందేమో చూడాలి.

బేబి సినిమాతో పోలిక లేదు

ఎస్‌కేఎన్



'బేబి' చిత్రంతో ఇండస్ట్రీ హిట్ అందుకొని మంచి జోరు మీదున్నారు నిర్మాత ఎస్‌కేఎన్. తాజాగా ఆయన తమిళ చిత్రం 'ట్రూ లవర్' హక్కులను సొంతం చేసుకున్నారు. దర్శకుడు మారుతితో కలసి తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్నరవి లీడ్‌రోల్స్‌లో నటించారు. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఎస్‌కేఎన్ మీడియాతో పంచుకున్నారు.

● ఒక స్నేహితుడి ద్వారా 'ట్రూ లవర్' సినిమా గురించి తెలిసింది. మారుతితో కలసి సినిమా చూశా. ఇద్దరికీ నచ్చడంతో తెలుగులో విడుదల చేయాలనుకున్నాం.

● ఏ రిలేషన్‌కు అయినా నమ్మకమే పునాది. 'ట్రూ లవర్' సినిమాలో మెయిన్ పాయింట్ అదే. 'బేబీ' సినిమాతో 'ట్రూ లవర్'ను పోల్చలేం. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు పాత్రలతో అనుభూతి చెందుతారు. ఈ తరం యువతీ యువకులు ప్రేమలో ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సినిమాలో దర్శకుడు చూపించారు. కొన్ని సీన్లు అద్భుతం అనిపించాయి. దర్శకుడు తను ఎంచుకున్న కథకు పూర్తి న్యాయం చేశాడు.

● రాజా సాబ్ సినిమాను మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఆ టీమ్‌లో నేనూ ఉన్నాను. ఆ సంస్థ మా ఫ్రెండ్లీ బ్యానర్ లాంటిదే. ప్రస్తుతం నిర్మాతగా నాలుగు చిత్రాలు చేస్తున్నా. మూడు యూత్ ఫుల్ లవ్‌స్టోరీస్. ఒకటి సైన్స్ ఫిక్షన్ జానర్‌లో ఉంటుంది. అలాగే అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే చిత్రం ఒకటి చేయాలనుంది. 'బేబీ' సినిమాను హిందీలో రీమేక్ చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు ప్రకటిస్తాం.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dlkF29q లో చదవండి.

SCHOLARSHIP ALERT

Inlaks Shivdasani Scholarships

Description: Inlaks Shivdasani Scholarships 2024 is a merit-based opportunity offered by the Inlaks Shivdasani Foundation (a non-profit organisation), to Indian students pursuing postgraduate studies at European, American, and UK universities abroad.

Eligibility: Open for an Indian passport holders who have a first-class or equivalent degree from recognised Indian universities/institutions. Students must have scored 65% in the Arts related subjects and 70% in Maths and Science related subjects. Applicants must be proficient in English and have received a valid deferred offer letter for the current academic year.

Prizes & Rewards: A maximum of USD 1,00,000 and other benefits (one-time)

Last Date: 22-03-2024 *Application:* Online Only

Short Url: www.b4s.in/aj/INLAKS1

JN Tata Endowment Loan Scholarship for Fall 2024 to Spring 2025

Description: The J N Tata Endowment invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India.

- Candidates must be interested to pursue Postgraduate/Doctoral/Postdoctoral studies abroad.
- Candidates who are at the end of the 1st year and entering into the second year of their overseas studies (Fall 2024 – Spring 2025) are also eligible to apply. This is applicable only if the minimum duration of the course is 2 years and there is at least one full academic year remaining to complete at the time of award of the loan scholarship, which is normally by July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or postgraduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2024.

Prizes & Rewards: Loan scholarship of up to Rs. 10 lakhs

Last Date to Apply: 15-03-2024 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/JNT8

Disha Scholarship Program

Description: An initiative of Birlasoft to offer financial assistance and support to individuals, facilitating their educational pursuits and ensuring the successful completion of their academic journey.

Eligibility: Only Female students

- Students domiciled in Delhi-NCR or Pune enrolled in the first year of General/ Professional Undergraduate courses at premier NIRF institutions or accredited universities and colleges across India.
- Candidates must have scored 65% in aggregate or an equivalent CGPA in the Grade 12 board examination from Delhi-NCR and Pune in 2023.
- The annual family income of the applicants from all sources must not exceed INR 5 lakh.
- Applicants must fall within the age bracket of 17 to 29 years at the time of submitting their applications.

Prizes & Rewards: Up to INR 25,000 annually *Last Date:* 15-03-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/SSPSP1

buddy4study.com

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, చైర్‌పర్సన్ రాధిక తదితరులు

మూడు బుట్టల విధానాన్ని అమలుపర్చాలి

పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 6: పట్టణంలో ప్రజలు మూడు బుట్టల విధానాన్ని తప్పనిసరిగా అమలుపర్చాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బీ శేషన్న అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో మంగళవారం పారిశుధ్య పనులను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయన రాధికతో పాటు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు బుట్టల విధానంలో తడిచెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను సేకరించాలన్నారు. వ్యర్థాలను మురుగుకాల్వలలో వేయరాదని, పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. అనంతరం వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు తోట రఘురాం, మొగళ్ అహ్మద్, హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్స్పెక్టర్‌లు అనుపమ, రామచంద్రరావు, ఆర్‌ఐ మోహనకృష్ణ, తాడిబోయిన రమేష్, చెరుకుల సురేష్‌రెడ్డి, ఇంజనీరింగ్ గ్రీనరీ సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్ పేరుతో ఎమ్మెల్యే కిలారి సరికొత్త నాటకం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 6: ఆటో నగర్ పేరుతో ఎమ్మెల్యే కిలారి సరికొత్త నాటకానికి తెరతీశారన్ని టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్ ఆరోపించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పటుచేయాల్సిన ఆటోనగర్ ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటుచేస్తామని చేస్తున్న ప్రకటనలపై అనుమానాలు వ్యక్తం చేశారు. నిన్న మొన్నటి వరకు దేవదాయ శాఖకు చెందిన 20 ఎకరాల భూమిలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటనలు చేసిన విషయాని గుర్తు చేశారు. అదే 20 ఎకరాల భూమిలో దశాబ్దాలుగా కౌలు చేస్తున్న రైతులను మభ్యపెట్టి, భయపెట్టి కౌలు హక్కులు వదులుకునేలా చేశారని ఆరోపించారు. తాజాగా నిడుబ్రోలు డంపింగ్ యార్డ్‌కు ఎదురుగా ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిలో ఆటో నగర్ ఏర్పాటు చేస్తామని కొత్త నాటకానికి తెరలేపటం ఆటోనగర్ కార్మికులను మోసం చేయటానికేనని ఆరోపించారు. భూమి ఇస్తానంటున్న వైసీపీ నాయకుడు కిలారి నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సదరు వ్యక్తి, ఎమ్మెల్యే కుమ్మక్కై ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. ఆటోనగర్‌ను ఏర్పాటుచేయాలంటే ప్రభుత్వం తరపున ఏపీఐఐసీ ద్వారా భూమి సేకరించి ఆటోనగర్ ఏర్పాటుచేయాలి కానీ ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటుచేస్తే దాన్ని ఆటో నరగ్ ఏలా అంటారని ప్రశ్నించారు. రోశయ్య మాయమాటలు, మోసాలు ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగు రీతిలో బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, షేక్ బాజీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 6: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పేదప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ సభ్యులు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో మంగళవారం ఎన్నారై కళాశాల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో మాజీమంత్రి ఆలపాటి దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, ముళ్ళపూడి వెంకట్, వెనిగళ్ళ శివప్రసాద్, క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డీఓప కరిముల్లా, నాగరాజు తదితరులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 6: స్థానిక కొత్తపేటలోని శ్రీమతి దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నేత్రాలయ ఐ కేర్ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్రప్రదేశ్ పొలిటికల్ ప్రొటెక్షన్ ప్రెసిడెంటు పల్నాటి నాగరాజు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో ఏమైనా దృష్టి లోపాలుంటే వాటికి వైద్యుల సలహాలతో సరిచేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం శాంత కుమారి, డ్రాయింగ్ మాస్టర్ వెంకటేశ్వరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ స్కూల్ వ్యవస్థాపకులకు సన్మానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్ వ్యవస్థాపకుడు దాసరి ప్రకాశరావు, రంగలక్ష్మి దంపతులను మంగళవారం ఘనంగా సన్మానించారు. స్కూల్ స్థాపించి 50 సంవత్సరాలు కావడంతో స్వర్ణోత్సవ వేడుకలను రెండు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎండీ మురళీకాంత్, ఈడీ గీతాకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరికీ మంచి జరిగేది టీడీపీ, జనసేన ఉమ్మడి నాయకత్వంతోనే

● వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు వంచనే
● రోడ్లు అధ్వానం, ప్రజల స్థితిగతులు అంధకారం
● మేం అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో వెలుగులు
● జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో రోడ్లు ఎట్లా ఉన్నాయో చూస్తేనే వైసీపీ ప్రభుత్వ పాలన అర్థమవుతుంది. ఇక ప్రజల స్థితిగతుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒక్క చాన్స్ ఇవ్వమన్నారు.. ప్రజలు నమ్మి ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక నమ్మిన ప్రజలను నట్టేట ముంచిన ప్రభుత్వం జగన్ ప్రభుత్వమని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని కొలకలూరులో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. మనోహర్ గ్రామానికి విచ్చేస్తున్న సందర్భంగా పార్టీ శ్రేణులు భారీసంఖ్యలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. వీరమహిళలు మనోహర్‌కు హారతులిచ్చారు. గ్రామానికి చెందిన రవిలాలు థామస్ సేవా సమితి ఆధ్వర్యంలో డప్పు కళాకారులు మనోహర్‌ను కలిసి ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. గ్రామ పర్యటనలో మనోహర్‌కు పలువురు గ్రామస్థులు అనేక సమస్యలను తెలిపారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి చేయాలన్నదే ఉమ్మడి టీడీపీ, జనసేన పార్టీల ముఖ్య ఉద్దేశమన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన వెంటనే గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రాష్ట్రంలో అంధకారం నెలకొందని ఆరోపించారు. తిరిగి రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకుని వెలుగులు పూయించాలంటే ప్రజలందరూ టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమిని గెలిపించుకోవాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు, డ్రైనేజ్, మంచినీరు, రైతులకు, కూలీలకు, యువత అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. కళాకారులను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. చేతి వృత్తిదారులకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతోపాటు విద్య, వైద్యంవంటి వాటిని ప్రజలకు చేరువచేసి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేలా పాలన సాగుతుందన్నారు. ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



మనోహర్‌కు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న వీరమహిళలు

అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోండి

● సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన రైతుసంఘం నాయకులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 6: దుగ్గిరాలలో ఇటీవల శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం జరిగి పసుపు, ఇతర పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం త్వరితగతిన ఆదుకునేలా చూడాలని రైతుసంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి రైతులు, రైతు సంఘం నాయకులతో కలిసి శివసాంబిరెడ్డి వెళ్లి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్‌ను కలిసి రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి వారి సమస్యలను విన్నవించడం జరిగిందన్నారు. ఘటనపై విచారణ చేపట్టామని మార్కెటింగ్ శాఖలో నష్టపోయిన రైతులు తమ వివరాలను ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఆ విచారణ పారదర్శకంగా జరిగేలా చూడాలని శివసాంబిరెడ్డి సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు. పసుపు రైతులసంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, వేములపల్లి వెంకటరామయ్యలు మాట్లాడుతూ నష్టపోయిన పసుపు రైతులకు క్వింటాల్ పసుపుకు రూ.11వేలతోపాటు పూర్తి ఇన్సూరెన్స్ ఇవ్వాలని, కోల్డ్ స్టోరేజ్ అద్దెలు, బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాజా వెంకటేశ్వరరావు, టి.రమాదేవి, భీమవరపు శేషిరెడ్డి, ఎం.చంద్రశేఖరరావు, బి.సురేష్, ఎస్.సురేంద్ర, ఎం.ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్‌తో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలి

సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్



కొల్లిపరలో పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

కొల్లిపర, ఫిబ్రవరి 6: పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. మంగళవారం మండలంలోని అత్తోట, చివలూరు, కొల్లిపర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ పరిశీలించిన వారిలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించండి

● సమీక్షలో డాక్టర్ మురళీకృష్ణసుబ్బరాయణం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 6: తెనాలి పట్టణ హెల్త్ సెంటర్లకు అనారోగ్యంతో వచ్చే రోగులకు తగిన గౌరవం ఇచ్చి వారికి నాణ్యమైన వైద్యసేవలందించాలని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం జిల్లా మలేరియా అధికారి, తెనాలి ప్రోగ్రామ్ ఆఫీసర్ తలాటం మురళీకృష్ణసుబ్బరాయణం అన్నారు. మంగళవారం పట్టణంలోని మారీసుపేట, పినపాడు, గంగానమ్మపేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఆరోగ్యసిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడేలా వివరంగా తెలపాలన్నారు. అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్, మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 9న జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.హర్షవర్ధన్, మోనికకుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, యూఎల్‌బీ ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శివగణేష్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్యపర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్షలో ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళీకృష్ణ సుబ్బరాయణం

ఒకే ఒక జీవితం.. సార్థకం చేసుకోండి

● ఖైదీలకు సీనియర్ సివిల్ జడ్జి లీలావతి సూచన

తెనాలి క్రైం, ఫిబ్రవరి 6: ఒకే ఒక జీవితం.. ఈ జీవితం మళ్ళీ రాదు.. ఈ నిండైన జీవితాన్ని సార్థకంగా చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలావతి తెలిపారు. మంగళవారం సబ్ జైలు ప్రాంగణంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ఖైదీల నుద్దేశించి మాట్లాడారు. స్వార్థం మనిషి ఆలోచనా శక్తిని నశింపజేస్తుంది. దురాశ, క్షణికావేశం, అహంకారం, పరిస్థితుల ప్రభావంతో నేరం చేసి జైలు జీవితం అనుభవిస్తున్నారు. ఈ జైలు జీవితం అనంతర జీవితాన్ని సరైన బాటలో తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతి వారికి రక్షణ కోసం కుటుంబవ్యవస్థ ఉంటుంది. అమ్మ, నాన్న, అన్నా, చెల్లి, బిడ్డలు, అవ్వాతాత వీరంతా మనకోసమేనని, ఈ బంధాన్ని మరచి తిరిగి నేరానికి పాల్పడి జీవితాన్ని పతనం చేసుకోవద్దన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి 18సంవత్సరాలు నిండని వారు ఉంటే జువెనైల్ హోమ్‌లో ఉంచాలని తెలిపారు. ఈ సందర్భంగా 2015 జువెనైల్ చట్టాన్ని గురించి వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాల ప్రకారం న్యాయవాదులను నియమించుకోలేని పరిస్థితుల్లో ఉన్న ఖైదీలు మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అనంతరం ఖైదీల బారికేడ్లు, పరిసరాల పరిశుభ్రత, ఫాగింగ్ పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న భోజనాలను స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, ప్యానల్ న్యాయవాది కంచర్ల చంద్రశేఖర్, న్యాయసేవ అధికార సిబ్బంది మహబూబ్, రజనీ, సబ్ జైలర్ కృష్ణారావు సిబ్బంది పాల్గొన్నారు.



ఖైదీల భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి లీలావతి

ఆర్టీసీతోనే సురక్షిత ప్రయాణం

పొన్నూరు డీపో మేనేజర్ టి.అజిత కుమారి



ప్రయాణీకులకు బహుమతులు అందచేస్తున్న మేనేజర్ అజిత కుమారి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 6: సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ కృషి చేస్తుందని ఆ సంస్థ మేనేజర్ టి.అజిత కుమారి అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో ప్రయాణీకుల లక్కీడీప్ తీసి బహుమతులు పంచిపెట్టారు. పొన్నూరు, నిజాంపట్నం, తెనాలి వట్టిచెరుకూరు మార్గంలో తిరిగే ప్రయాణీకులు ఈ లక్కీడీప్‌లో పాల్గొన్నారు. లక్కీడీప్‌లో సుభానీ, డి.రమేష్, కేశవరెడ్డి బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ అజితకుమారి మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైనదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్లాట్ ప్యానల్స్

● వైరింగ్, ఇంటర్‌నెట్ సదుపాయాలకు నిధులు నిల్
● పాఠశాలల్లో పెరిగిపోతున్న విద్యుత్ బకాయిలు



ఓ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్లాట్ ప్యానల్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6 : విద్యార్థుల కోసం ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. రూ.లక్షలు వెచ్చించి పాఠశాలలకు సరఫరా చేసిన ఇంటర్ యాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ నిరుపయోగంగా మారుతున్నాయి. వీటిని వినియోగించేందుకు ఎంతో వ్యయం చేసి ఉపాధ్యాయులకు శిక్షణ సైతం ఇచ్చారు. కానీ వినియోగానికి అవసరమైన వైరింగ్, ఇంటర్‌నెట్, విద్యుత్ సదుపాయాలకు డబ్బులు లేకుండా చేశారు. ప్రతి ఏటా ఉన్నత పాఠశాలలకు రూ.75 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.25వేలు పాఠశాల నిర్వహణ నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. గత ఏడాది నుంచి రూపాయి కూడా ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క ప్లాట్ ప్యానల్‌కు రూ.లక్షకు పైగా వెచ్చించిన ప్రభుత్వం ప్రతి ఉన్నత పాఠశాలకు 10వరకు పంపింది. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే ఎన్నో వేల ప్లాట్ ప్యానల్స్‌ను పాఠశాలలకు పంపిణీ చేశారు. కొన్ని పాఠశాలలకు రెండో విడత పంపేందుకు తాజాగా చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇందుకోసం అవసరమైన వివరాలు సేకరించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. ఒక్కో ప్లాట్ ప్యానల్‌ను తరగతి గదిలో విద్యుత్ వైరింగ్ బోర్డు ఏర్పాటు చేయాలంటే రూ.3వేల వరకు వ్యయం అవుతుంది. పాఠశాలల వారీగా చూస్తే ఇందుకు రూ.30వేలు అవసరం. దీనికి తోడు ప్రతి గదికి ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించాల్సి వుంది. కానీ ఇప్పటివరకు ఇంటర్‌నెట్ ఊసే లేకుండా పోయింది. దీంతో ఉపాధ్యాయులు తమ మొబైల్ డేటాలో కొంత వెచ్చించి వైఫై ద్వారా అవసరమైన బోధన చేస్తున్నారు. ప్లాట్ ప్యానల్స్ ఏర్పాటుతో అప్పటివరకు ఉన్న డిజిటల్ క్లాస్ రూమ్, వర్చువల్ క్లాస్‌రూమ్ బోధనకు ఏర్పాటుచేసిన సాంకేతిక పరికరాలు తుప్పుపట్టి పోతున్నాయి. కరోనా ముందు వరకు పాఠశాలల్లో వీటిని సద్వినియోగం చేశారు. కాగా పాఠశాలలకు నిర్వహణ నిధులు ఇవ్వకపోవడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిపివేశారు. ఆరు నెలల నుండి విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. విద్యుత్ బిల్లులకైనా డబ్బులు ఇవ్వాలని కోరితే సంబంధిత మంత్రి బిల్లులు చెల్లించవద్దని వాటిని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో ఉపాధ్యాయులు మిన్నకున్నారు. కానీ బిల్లు బకాయిలు పేరుకుపోతుండటంతో విద్యుత్ శాఖ నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. బిల్లుల బకాయిలు పేరుకుపోతే కనెక్షన్ కట్ చేయడం తప్పదంటూ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇంతా చేసి కొద్ది మొత్తాలను ఇవ్వకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.వేల కోట్లతో ఏర్పాటుచేసిన ఈ విధానం వల్ల ఉపయోగం లేకుండా పోతోంది. వెంటనే విద్యుత్ కనెక్షన్, బిల్లుల చెల్లింపు, ఇంటర్‌నెట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈవీఎంలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ఎంపీడీవో వై.విష్ణుప్రసాద్



కొల్లిపర మండలం వల్లభాపురంలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

కొల్లిపర, ఫిబ్రవరి 6: గ్రామాల్లో ఈవీఎం, వీవీప్యాట్స్‌పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సును ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బీవై విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, చివలూరు గ్రామాల్లో ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మండల రిసోర్స్‌పర్సన్స్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఆర్‌వోలు ఓటర్లకు ఈవీఎం వీవీ ప్యాట్ అనుసంధానం గురించి వివరించారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ ఈవీఎంలపై ప్రజల్లో అపోహలు తొలగించాలనే ఉద్దేశంతో ఈ సదస్సును ఏర్పాటుచేశామన్నారు. సదస్సులో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఆర్‌ఐ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేబ్రోలు ఎస్ఐ వీఆర్‌కు...

● నూతన ఎస్ఐగా మహేష్

చేబ్రోలు, ఫిబ్రవరి 6: విధుల్లో చేరి రెండు రోజులు కూడా పూర్తి చేసుకోకుండానే చేబ్రోలు ఎస్సై గిరిబాబు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఆదివారం చేబ్రోలులో జరిగిన చల్లపల్లి విజయ్ అనే యువకుడు రోడ్డు ప్రమాదానికి సంబంధించి సోమవారం బాధిత కుటుంబం చేబ్రోలులో మృతదేహంతో ధర్నా చేశారు. మూడు గంటలకు పైగా ప్రధాన రహదారిపై ధర్నా జరగటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మృతుడి కుటుంబీకులు ఎస్సై గిరిబాబు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటమే కాకుండా తూలనాడుతూ మాట్లాడారని ఆరోపణలు గుప్పించారు. అంతేకాకుండా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను మార్చారు అంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు నేపథ్యంలో మంగళవారం పోలీస్ ఉన్నతాధికారులు ఎస్సై గిరిబాబును చేబ్రోలు నుంచి వీఆర్‌కు బదిలీ చేయటమే కాకుండా నూతన ఎస్సైగా ప్రకాశం జిల్లాకు చెందిన మహేష్‌ను నియమించారు. ఎస్సై మహేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యకుడిగా కోటేశ్వరరావు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6 : బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యకునిగా తోటకూర కోటేశ్వరరావును నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు మంగళవారం నియామక పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రైతుల శ్రేయస్సుకు అవసరమైన చేయూత అందించి పార్టీ అభివృద్ధికి దోహదపడేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కోటేశ్వరరావును పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.

షర్మిల యాత్రను జయప్రదం చేయాలి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 6: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల పర్యటనను విజయవంతం చేయాలన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జక్క రవీంద్రనాథ్ మంగళవారం కోరారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం బాపట్ల పట్టణంలో భారీ రోడ్డుషో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే 8వ తేదీ తెనాలి కొలకలూరులో రచ్చబండ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని పాదయాత్రను విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

16న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన జరుగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నేత చెంగయ్య పిలుపునిచ్చారు. మంగళగిరిలో మంగళవారం విస్తృత సమావేశం పట్టణ కార్యదర్శి వై.కమలాకర్‌రావు అధ్యక్షతన జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ నేతలు జేవీ రాఘవులు, టీ.శ్రీరాములు, వై.శివనాగేశ్వరరావు, పీ.పూర్ణ, గాలి శ్రీనివాసరావు, షేక్ జానీబాషా, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.